

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు




సంపుటి : 13 సంచిక : 06 ఫిబ్రవరి 2008

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 40

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥150/-

విడి ప్రతి : రు॥ 10/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు - 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు - 534 265

☎ 08814 - 224747

9247104551


ఈ సంచికలో....


పాతాళమెరక ....... 28-11-07

భీమవరం ............ 17-12-07

పాలమూరు ......... 13-12-07

అత్తిలి .................. 21-12-07

జిన్నూరు .............. 25-12-07

కాపవరం ............ 20-12-07



ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747


## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 28-11-2007, పాతాళమెరక)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

బ్రహ్మం గురించి వర్ణిస్తూ సత్యం, శివం, సుందరం, అద్వైతం అని వేదంలో చెప్పారు. అద్వైతస్థితి మన హృదయంలో ఉంది. అది మనకు అందేవరకు పునర్జన్మలు వస్తూనే ఉంటాయి, ఈలోపుగా కాముడు, కాలుడు వీరిద్దరు మనలను విడిచిపెట్టరు. సృష్టిలోనికి జీవకోటిని కాముడు తీసుకొనివస్తాడు, చనిపోయే వారినందరిని తీసుకొని పోయేవాడే కాలుడు. కాముడు అంటే మన్మథుడు, కాలుడు అంటే యమధర్మరాజు. వీరిద్దరిని జయించినవాడు ఈశ్వరుడు. మనం ఈశ్వరుడిని స్మరించుకొంటూ ఉంటే, ఆయన పాదాలను ఆశ్రయిస్తే వీరిద్దరి నుండి బయట పడవచ్చు. రాబోయే జన్మ ఏది వస్తుందో మనకు తెలియదు. ఇప్పుడు మానవజన్మ వచ్చింది. ఈ దేహాన్ని జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి. భగవంతుడిని స్మరించే కాలం పెంచుకోవాలి. మన పనులు మనం చేసుకొంటూ, అవసరంలేని గొడవలకు వెళ్లకుండా ఉంటే చాలా టైము మనకు సేవ్ అవుతుంది. ఆ టైమును భగవంతుడిని స్మరించటానికి, ధ్యానించటానికి ఉపయోగించుకోవాలి.

ఈ దేహం పుట్టినరోజు నిజమైన పుట్టినరోజు కాదు, నీ హృదయంలో చైతన్యం ఉంది, అది నీకు ఎరుకలోనికి వస్తే అదే నిజమైన పుట్టినరోజు. బర్త్‌డే, డెత్‌డేలు ఇదంతా మాయ, ఇదంతా అజ్ఞానం. అజ్ఞానం ఉన్నంతసేపు మనకు జన్మలు వస్తూనే ఉంటాయి. అజ్ఞానం తొలగించుకోవటానికే ఈ శ్రవణాలు, మననాలు, స్మరణ, ధ్యానం, విచారణ ఇవిఅన్నీ. మనం శరీరంతో ఏ పని చేస్తున్నాము అన్న విషయం కంటే మనస్సుతోటి ఏది స్మరిస్తున్నాము అనేది ముఖ్యం. మేము మంచివారము, మేము బుద్ధిమంతులము అని శవాల్లా కూర్చొని మనస్సుతోటి చెడ్డవిషయాలు ఆలోచిస్తూ ఉంటే ఏమీ ప్రయోజనం లేదు.

మనం మనస్సును బాగుచేసుకోవాలి. ఎందుచేతనంటే ఈ శరీరాన్ని కల్పించేది, లోకాన్ని కల్పించేది, నీవు వేరు నేను వేరు అనే వేరుబుద్ధిని కల్పించేది అంతా మనస్సే. పునర్జన్మలను తీసుకొని వచ్చే హేతువులు అన్నీ మనస్సులోనే ఉన్నాయి. మనం చేసే సాధనలు అన్నీ కూడా మనస్సును బాగుచేసుకోవటానికే. మీ మనస్సు ఏ విషయాలను స్మరిస్తోందో, ఏ విషయాల గురించి ఆలోచిస్తోందో మీకు తెలుస్తుంది కదా, అది జాగ్రత్తగా చూసుకోండి. శరీరం చేసే దానికంటే మనస్సు చేసే దానికే ఎక్కువ అపచారం వస్తుంది. ఏదైనా ఒక వస్తువుకు నిప్పు పెడితే అది వెంటనే తగులబడదు, అది తగలబడటానికి కొంతటైము పడుతుంది. అరుణాచల దీపాన్ని ఎవరైతే దర్శించి వచ్చారో వారి అజ్ఞానానికి నిప్పు పెట్టినట్లు అవుతుంది. అజ్ఞానం పూర్తిగా బర్నవ్వటానికి చాలా టైము పట్టవచ్చు. మన బుద్ధిలో ఉన్న దోషాలు పోవటానికి ఆ దీపదర్శనం మనకు సహకరిస్తుంది, అంటే బాహ్యంగా దాని ప్రయోజనం వెంటనే కనబడకపోయినా, నెమ్మదిగా కనిపిస్తుంది.

మనలో ఉన్న అజ్ఞానం నశించటానికి భగవంతుడు చెప్పిన మాటలనుగాని, మహర్షులు చెప్పిన మాటలనుగాని ప్రమాణంగా తీసుకోవాలి గాని ఎల్లయ్య చెప్పిన మాటలను, పుల్లయ్య చెప్పిన మాటలను మీరు ప్రమాణంగా తీసుకోకూడదు. వారు అహంకారంతో కాలిపోతూ ఉంటే ఇంక మనకు ఏమి చెప్పగలరు. మీరు కాలాన్ని పాడుచేసుకోవద్దు. భగవంతుడు చెప్పిన మాటలను ప్రమాణంగా తీసుకొని జీవిస్తూ ఉంటే మనలో ఉన్న అజ్ఞానం అంతా నశిస్తుంది. ఇతరులకు మనపట్ల ఉన్న రాగద్వేషముల మీద మన జీవితాలు ఆధారపడి లేవు. ఈ సృష్టిలో ప్రతీ జీవకోటి యొక్క జీవితం ఈశ్వరసంకల్పం ప్రకారం జరుగుతుంది. అట్టి ఈశ్వరుడిని ఆరాధించకుండా ఆయన పాదాల దగ్గరకు మనం చేరుకోలేము. మనం తొందరగా చనిపోవాలి అని అనుకోకూడదు, చిరకాలం జీవించాలి అని అనుకోకూడదు. అలా అనుకొంటే ఈశ్వర సంకల్పాన్ని అగౌరవపరచినట్లు అవుతుంది. మనం కంగారుపడటం వలన తొందరగా తీసుకొని వెళ్ళడు, ఇంకా జీవించాలి అనే కోరిక ఉన్నంత మాత్రంచేత ఆయన నిర్ణయానికి భిన్నంగా కాలాన్ని పొడిగించడు. ఈ సృష్టిలో ప్రతీ సంఘటన ఆయన సంకల్పం ప్రకారమే జరుగుతుంది. జన్మాంతరం నుండి వస్తున్న సంస్కారములనుబట్టి పుణ్యకర్మ ఎంత అనుభవించాలి, పాపకర్మ ఎంత అనుభవించాలి, ఎప్పుడు సుఖం వస్తుంది, ఎప్పుడు దుఃఖం వస్తుంది ఇవన్నీ ఈశ్వరుడు నిర్ణయిస్తాడు. మనం ఈశ్వరుడిని ప్రార్థించటం ఎందుకు అంటే ఏదో 200 సంవత్సరాలు బతకటం కోసం కాదు, మనం పవిత్రులం అవ్వటానికే ఈశ్వర స్మరణ. తపస్సు చేయటం వలన ఏకాగ్రత, పవిత్రత వస్తాయి అని వ్యాసమహర్షి చెప్పాడు. మనస్సుకు ఏకాగ్రత వచ్చినప్పుడు బయట ఏదో ఉందని బాహ్యముఖంగా ప్రయాణం చేయటం ఆగిపోతుంది, దానికి అంతర్దృష్టి కలుగుతుంది. అప్పుడు నీకు అమృతానుభవం కలుగుతుంది.

ఒక్క చైతన్యం తప్పించి అన్నీ కాలప్రవాహంలో కొట్టుకొనిపోతాయి. గుళ్ళు, గోపురాలు, పునర్జన్మలు, సంతోషాలు, దుఃఖాలు, గొప్పలు, తిప్పలు అన్నీ మనోకల్పితాలు. గుడులు, గోపురాలు ఎందుకు పెట్టారు అంటే ఉపాసనకు మనకు ఏదో సపోర్టు ఉండాలి. పూర్వపు మహర్షులు ఏమి చేసారు అంటే ఏదో రూపాన్ని పెట్టి వారి తపోశక్తిని ఆ రూపంలో నింపి, మనం ఆ రూపాన్ని దర్శించుకొంటే ధన్యులయ్యేలాగ దేవాలయాలలో విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఉపాసన లేకపోతే మనోచాపల్యం తగ్గదు. ఆధ్యాత్మికం అంటే అజ్ఞానంలో నుండి జ్ఞానంలోనికి, చీకటిలోనుండి వెలుతురులోనికి ప్రయాణం. మనకు జన్మాంతరంలో ఉన్న సంస్కారమునకు అనుగుణంగా మనకు ఇష్టమైన మార్గంలో సాధన చెయ్యటం మంచిది, అనుకరణ పనికిరాదు. ఆధ్యాత్మికంగా పురోగతి సాధించలేకపోవటానికి కారణం భయం. ఊహించుకోవటం వలన భయం వస్తోంది. మనం ఏమీ ఊహించుకోము అనుకోండి, భగవంతుడి సంకల్పం ఎలా ఉంటే అలా జరుగుతుంది అనుకొంటే నెమ్మదిగా భయం తగ్గిపోతుంది. అది అలా జరుగుతుందేమో, ఇది ఇలా జరుగుతుందేమో అని ఏదో ఊహించుకొంటూ ఉంటే ఆ జరిగేది మీరు ఎలాగూ ఆపుచేయలేరు. మీరు ఊహించుకోవటం మానివేస్తే సాధనతో సంబంధం లేకుండా భయం తగ్గిపోతుంది. భయస్థులు ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందలేరు, భౌతికంగా కూడా అభివృద్ధి చెందలేరు, భయస్థులకు ఉభయభ్రష్టత్వం వస్తుంది.

పొగడ్తలను, విమర్శలను మీరు లోపలకు తీసుకోవద్దు. అవి మీ మనస్సులోనికి వస్తే మనస్సు పొల్యూట్ అయిపోతుంది. మీకు పాండిత్యం ఉంది, సంఘసేవ చేస్తున్నారు, మీరు హైలీఎడ్యుకేటెడ్ అని అరుణాచలంలో ఒకరితో అన్నాను, ఆయన ఏమన్నారు అంటే ఇవన్నీ అవుట్‌సైడ్ గొడవలండి అన్నారు. నా పాండిత్యం, నేను చేస్తున్న సంఘసేవ, నాకున్న గౌరవం ఇవన్నీ బయటగొడవలు. వీటివలన మనకు ఏమీ కలిసిరాదు. మనం ఎలా జీవిస్తున్నాము, లోపల మన అంతస్థు ఏమిటి, మనం ఏ భావంతో మాట్లాడుతున్నాము, ఏ భావంతో పనిచేస్తున్నాము, లోపల సూక్ష్మదేహం పవిత్రంగా ఉందా అవి ముఖ్యం. ఈ బయట గొడవలు ఎంత అబద్ధమో అంత నిజం అని మనం అనుకొంటున్నాము కాబట్టి వాటిని చూసి విర్రవీగిపోతున్నాము, మనలను ఎవరూ పట్టుకోలేక పోతున్నారు, దేహగతమైన నేను పెరిగిపోతోంది. ఇండివిడ్యువల్ ఐ లో నుండి ఫుల్‌నెస్‌లోనికి ప్రయాణం చేయటమే స్పిరిట్యువల్ జర్నీ, దీనికోసం ఎవడైతే ప్రయత్నం చేస్తున్నాడో, సాధన చేస్తున్నాడో వాడే సాధకుడు. దేవుడికంటే వేరుగా ఏదీ లేదు అంతా ఒకటే ముద్ద అనేటువంటి అనుభవం ఎవడికైతే కలిగిందో, ఆ ఫుల్‌నెస్ ఎవడికైతే వచ్చిందో వాడికి ఎటుచూసినా ఆనందమే, ఎటుచూసినా శాంతే, ఎటుచూసినా సుఖమే. ఒక మనిషిని చూసేటప్పుడుగాని, ప్రకృతిని చూసేటప్పుడుగాని మన మనస్సులో ఏమి జరుగుతోందో, మన బుద్ధిలో దోషాలు ఏమిటో పరిశీలనగా చూసుకోవాలి, ఇవే కదా మనకు నిజమైన శత్రువులు అనుకొని, వాటిని నిరంతరం జాగ్రత్తగా

పరిశీలిస్తూ ఉంటే అవి నెమ్మదిగా పల్చబడిపోతాయి. జ్ఞాని ఏది చెప్పినా నిండుహృదయంతో చెపుతాడు. జ్ఞాని యొక్క నాలుక హృదయంలో ఉంటుంది, అక్కడ కపటం ఉండటానికి అవకాశం లేదు. మనస్సు పరమాత్మలో అణిగిఉన్నప్పుడు ఒక మాట చెప్తారంటే ఆమాట జరిగితీరవలసిందే. జఠాయువుతో రాముడు ఏమన్నాడు వెళ్ళు, నువ్వు వైకుంఠానికి వెళ్ళు అన్నాడు, వెళ్ళిపోయింది, ఆ మాటే ఆదేశం.

సత్యం మన హృదయంలోనే ఉంది కాని అది ఉన్నట్లు కూడా మనకు తెలియటం లేదు. మహర్షులతోటి, మహాత్ములతోటి అనుబంధం వలన ఏదో ఉంది, ఏదో ఉంది అని మీ బుద్ధికి తెలుస్తూ ఉంటుంది, అప్పుడు దానిని అందుకోవటానికి మీరు సాధన చేస్తారు. ఆ గుర్తింపు కలుగజేసే వాడు, దానిని ఎరుకలోనికి తీసుకొని వచ్చేవాడు మహర్షి. భగవద్గీత చదువుతున్నాము అనుకోండి, అర్థం కావటం లేదు అని చదవటం మానకూడదు. భగవద్గీత ఎవరు చెప్పారు అంటే పరమాత్మ చెప్పాడు, చైతన్యం చెప్పింది. మనకు చైతన్యం అనుభవంలో లేదు. మనం దేహబుద్ధితోటి, అహంకారంతోటి అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాము. జీవలక్షణాలతో చదువుతూ ఉంటే అది అర్థం కాదు. అలాగని చదవటం మానకూడదు. అలా చదవగా, చదవగా ఎప్పుడో ఆయన అనుగ్రహం వర్షిస్తుంది, అవగాహన చేసుకొనే బుద్ధిని ఆయనే ప్రసాదిస్తాడు. భక్తి మంచిదే కాని అక్కడ ఎంతోకొంత బీజరూపంలో మనస్సు ఉంటుంది. నీవు వేరు, నేను వేరు అనే భావన ప్రహ్లాదుడికి ఎంతో కొంత ఉంది కాని ఆయన మహాభక్తుడు. నర్శింహస్వామి ఏమి చేసాడు అంటే ప్రహ్లాదుడి శిరస్సును టచ్ చేసి కొన్ని క్షణాలలో ద్వైతభావనను తీసేసాడు, అది భగవంతుడి అనుగ్రహం. మనకు ఏది మంచిదో మనకంటే ఎక్కువ మన గురువుకు తెలుసు, భగవంతుడికి తెలుసు. ఒక పుష్పం దగ్గర కూర్చొన్నాము అనుకోండి, వాసన రాకుండా ఎలా ఉంటుంది. అది నీకు తెలిసినా, తెలియకపోయినా ఆ పుష్పంలో నుండి వాసన వస్తూనే ఉంటుంది. హోలీకంపెనీ అట్టిది. సత్పురుషుల సమక్షంలో వారి వైబ్రేషన్స్ మనమీద పనిచేస్తాయి. వారు సైలెంట్‌గా పని చేస్తారు. నువ్వు ఏ వాసన చేత, ఏ అలవాటు చేత పీడింపబడుతున్నావో చూసి నీకు తెలియకుండానే ఆపరేట్‌చేసి వాటిని బయటకు తోలేస్తారు. నీకు సహాయసహకారములు అందిస్తున్నట్లు కూడా నీకు తెలియనివ్వరు. వారు చేసేపని నార్మల్‌గా, నేచురల్‌గా జరిగిపోతుంది, నిన్ను అనుగ్రహిస్తున్నట్లు నీ ప్రక్కన కూర్చొన్నవాడికి కూడా తెలియనివ్వడు, అదీ జ్ఞాని యొక్క వైభవం.

గంటల తరబడి ఉపన్యాసాలు చెప్పి మీ లోపల ఉన్న ఒక్క వాసనను కూడా బయటకు తీయలేనివాడు గొప్పవాడా, మీతోటి ఏమీ మాట్లాడకుండా మౌనంగా పనిచేస్తూ మీలో ఉన్న వాసనను తొలగించేవాడు గొప్పవాడా? మీకు కావలసింది పనా లేక గొప్పలు, గొడవలా? మీతో ఏమీ మాట్లాడకపోయినా జ్ఞానియొక్క మౌనం అనుగ్రహం, చూపు అనుగ్రహం,

ప్రతీదీ అనుగ్రహమే. ఇక్కడ మాటలు ముఖ్యంకాదు, పని ముఖ్యం. మీరు రాంగ్‌పాత్‌లో వెళుతున్నారు అనుకోండి మిమ్మల్ని సరిచేసి రైట్‌పాత్‌లో ప్రయాణం చేసేటట్లు చూస్తాడు, వాడు గురువు. ఒక గ్రంథం చదివేటప్పుడు అర్థం చేసుకోవటంలో పొరపాటు రాకూడదు. పొరపాటు కనుక వస్తే అక్కడ నుండి పతనం ప్రారంభమవుతుంది. మనకు బుద్ధిసూక్ష్మత లేనప్పుడు పొరపాట్లు వస్తాయి. చెప్పినవాడు ఏ స్థాయిలో ఉండి చెప్పాడో ఆ చైతన్యస్థాయి మనకు లేనప్పుడు దానిని మనం అందుకోలేము. అందుకోలేకపోయినా పరవాలేదు, భగవంతుడు చెప్పిన మాటలు అబద్ధం అనుకొంటాము. ఇక్కడ మనం మనస్సుతో అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాము. అక్కడ చైతన్యం చెప్పింది, అది నీ మనస్సుకు ఎలా అర్థమవుతుంది. అందుచేత నీ మనస్సును తీసుకొని వెళ్ళి అక్కడ సరండర్ చెయ్యి, అప్పుడు నీ మనస్సు అణుగుతుంది, అప్పుడు అక్కడ ఉన్న వస్తువు నీకు వ్యక్తమవుతుంది. అంతేగాని నీ మనస్సుతో తెలుసుకోవటానికి నీ మనస్సుకు అది ఒక ఆబ్జెక్టు కాదు. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే ఎవరి సమక్షంలో నీకు శాంతి కలుగుతుందో, ఎవరి సమక్షంలో నీ మనస్సు అణుగుతోందో, ఎవరి సమక్షంలో జ్ఞానాన్ని సంపాదించాలనే బుద్ధి నీకు కలుగుతోందో వాడితో నీవు శృతి కలిపి, వాడిని గురువుగా తీసుకో. అసలు మనం డిజర్వు అయ్యి ఉంటే, మనకు అర్హత ఉంటే, యోగ్యత ఉంటే గురువు దగ్గరకు మనం వెళ్ళనక్కరలేదు, గురువే మన దగ్గరకు వస్తాడు. గురువు అంటే ఆత్మ, ఆత్మకు చావులేదు, అందుచేత చనిపోయిన గురువు అంటూ ఎవడూ ఉండడు ఆయన అలా పనిచేస్తూనే ఉంటాడు, జ్ఞాని చేసే పని మన కళ్ళకు కనబడదు. మీ ప్రయత్నం వలన, మీ తెలివి వలన తొలగించుకోలేనటువంటి బండరాళ్ళలాంటి వాసనలు గురువు యొక్క దయ వలన బయటకు పోతాయి, గురువు యొక్క అనుగ్రహం అట్టిది.

కర్తృత్వబుద్ధి మన తెలివితేటల వలన, మన ప్రయత్నం వలన పోదు. ఫలితం ఆశించకుండా సత్కర్మను చెయ్యగా చెయ్యగా ఇదంతా నేను చేయటం లేదు, భగవంతుడే చేస్తున్నాడు అనే బుద్ధి నీకు కలుగుతుంది. అప్పుడు కర్తృత్వం నశిస్తుంది. ఇదంతా భగవంతుడే చేస్తున్నాడు అనే అనుభవం నీకు వచ్చేవరకు నీకు కర్తృత్వం నశించదు అని ఆచార్యులవారు చెప్పారు. నేను కాదు చేసేది, ఇదంతా భగవంతుడే చేస్తున్నాడు అనే ఆ చిన్న గెడప దాటటానికి, ఆ చిన్న అవగాహన నీకు రావటానికి ఆయన దయ లేకుండా నీకు రాదు, అప్పటివరకు దుఃఖం నశించదు. కేవలం శరీరబుద్ధి పెట్టుకొని ఎంతసేపు ఏమి తింటున్నాము, ఏమి కట్టుకొంటున్నాము, ఈ శరీరాన్ని అందరూ గౌరవిస్తున్నారా లేదా అని చూసుకొంటూ నూటికి నూరుపాళ్ళు దేహపోషణబుద్ధిలో ఉంటూ మోక్షాన్ని పొందాలనుకోవటం ఎటువంటిది అంటే ఒక మొసలిని నమ్ముకొని నదిని దాటటం వంటిది అని ఆచార్యులవారు చెప్పారు, అంటే ఇంక వారికి జ్ఞానం రాదు. మన మనస్సులో పవిత్రత ఉంటే మన ఇష్టదైవం కనిపిస్తాడు,

మాట్లాడతాడు, అందులో సందేహం లేదు. రామకృష్ణపరమహంసగారు దేవుడితో మాట్లాడేవారు. నీకు దేవుడు కనిపించవచ్చు, వరాలు ఇవ్వవచ్చు, ఇవన్నీ వ్యవహారికసత్యములే. కాని నేను దేవుడిని చూసాను, దేవుడు నాకు వరాలిచ్చాడు అనే ఫాల్స్ ఐ నీలోపల ఉన్నాడు కదా, ఆ నేను అనే సమస్య నిశ్శేషంగా పరిష్కారం అయ్యేవరకు నీకు బ్రాహ్మీస్థితి కలుగదు.

మనం చేసే సాధనలు గోరువెచ్చని నీళ్ళులాగ చేస్తున్నాము. సాధన ఎలా చెయ్యాలి అని పెద్దలు చెపుతారంటే ఏరోజుకారోజు నా జీవితానికి ఇది చివరిరోజు అని చెయ్యాలి. వారం రోజులలో నీవు చనిపోతావు అని పరీక్షిత్‌మహారాజుకు శాపం పెడితే ఆయన ఎంతో శ్రద్ధగా భాగవతం శ్రవణం చేసి వారం రోజులలో తరించాడు. ఇంక రేపు మనం ఉండము, ఇదే చివరిరోజు అనుకొంటూ సాధన చేస్తే నీవు తప్పనిసరిగా సక్సెస్ అవుతావు, సాధనాఫలం ఎప్పడో కాదు, ఇప్పడే నీకు అందుతుంది, నీకు శాంతి కలుగుతుంది. ఎంతో కొంత మనం ప్రయత్నం చేయాలి, ప్రయత్నం చేస్తూ ఉంటే కాలం కలిసివస్తుంది. మీరు తొందరపడవద్దు. మీరు చేసే ప్రతీ ప్రయత్నం భగవంతుడు చూస్తూ ఉంటాడు. ఈశ్వరుడు మనలో అంతర్యామిగా ఉన్నాడు, అది మర్చిపోవద్దు. మనం చేసే ప్రయత్నం వ్యర్థం అవ్వనివ్వడు. బ్రాహ్మీస్థితి పొందటానికి ఆ ప్రయత్నం నీకు సహకరించేలా చేస్తాడు. మీరు చేసే మంచిగాని, ప్రయత్నంగాని ఏదీ వృథా పోదు, నీది నీకే ఇస్తాను అని పరమాత్మ చెప్పాడు. మనం న్యూస్ పేపర్‌ని నమ్ముతాముగాని భగవంతుడి మాటలను నమ్మము ఎందుచేతనంటే మనది పాడుబుద్ధి. దైనందిన జీవితంలో మన బిహేవియర్ కపటం లేకుండా చూసుకొంటే మనకు ఈశ్వరానుగ్రహం కలుగుతుంది. లౌకికులతో సహవాసం ఉంటే నెమ్మదిగా తగ్గించుకోండి లేకపోతే నెమ్మదిగా మన బ్రెయిన్ పొల్యూట్ అయిపోతుంది. మీకు ఆధ్యాత్మికశక్తి వచ్చాక లౌకికులతో స్నేహం చేసినా ఫరవాలేదు. చెట్టు పెద్దది అయిపోయిన తరువాత మేకలు, గొర్రెలు మొదలుకు రాసుకొన్నా ఫరవాలేదు కాని చెట్టు చిన్నదిగా ఉన్నప్పడు మేకలు రాసుకొంటే ఆ మొక్క పడిపోతుంది. ఆధ్యాత్మికంగా మనం పిల్లలుగా ఉన్నప్పడు బహుజాగ్రత్తగా ఉండాలి.

పట్టించుకోవలసింది పట్టించుకోండి, వదిలేయవలసింది వదిలేయండి అని భగవాన్ చెపుతారు దాని అర్థం ఏమిటి అంటే చేతిలో ఉన్న పనిని పట్టించుకోండి శ్రద్ధగా చెయ్యండి, దాని ఫలితం గొడవ వదిలేయండి, ఆ ఫలితం మన చేతిలో లేదు, అది ఈశ్వరుడి చేతిలో ఉంది. కర్మఫలితం మనం వదిలేయకుండా దానిని పట్టుకొన్నా అది మన ఇష్టానుసారం ఉండదు. అందుచేత మీరు పట్టించుకోవలసింది పట్టించుకొంటే అంటే మీరు చేసే పని హృదయపూర్వకంగా, ఏకాగ్రంగా, శ్రద్ధగా కనుక చేస్తే అది కూడా భక్తితో సమానమే. మీ చేతిలో ఉన్న లౌకికకర్మను ఏకాగ్రంగా, పవిత్రంగా చేస్తూఉంటే, ఈశ్వరుడి ప్రీత్యర్థం చేస్తూ ఉంటే అది భౌతికపని కింద మీకు అనిపిస్తుంది కాని అది కూడా ఆధ్యాత్మికమైన పనే.

వదిలేయవలసింది వదిలేయండి అంటే కర్మఫలితం గొడవ వదిలేయండి. ఒకోసారి మనం అనుకొన్నది వస్తుంది, ఒకోసారి అనుకొన్నది రాదు, ఒకోసారి తక్కువ వస్తుంది, ఒకోసారి ఎక్కువ వస్తుంది. ఒకోసారి అసలు రాదు, ఇదంతా ఈశ్వరుడి చేతిలో ఉంది కాబట్టి మీరు దానిని వదిలేయండి. కర్మ చేయటం వలన అశాంతి రాదు, కర్మఫలం మీద కాంక్ష ఎక్కువగా ఉన్నప్పుడు అశాంతి వస్తుంది. పట్టించుకోవలసింది పట్టించుకోండి, వదిలేయవలసింది వదిలేయండి ఈ రెండు మాటలు మీకు అర్థమైతే మరణానంతర జీవితం మాట ఎలా ఉన్నా ఈ ప్లానెట్ మీద మీరు బతికిఉన్న రోజులు సుఖంగా, శాంతిగా బతకవచ్చు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 17-12-2007, భీమవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం చివరిరోజులలో భక్తిని పెంచుకోవాలి. ఒంటిగంట దాటాక సూర్యుడు అస్తమించేవైపుకు వెళతాడు. మన జీవితాలు కూడా అంతే 50 ఏళ్ళు దాటాక మనకు అస్తమించే రోజులు అంటే ఇంక పోయేరోజులే కాని వచ్చేరోజులు కాదు. 50 ఏళ్ళకు ముందు భక్తి ఉండకూడదు అని కాదు కనీసం 50 ఏళ్ళు జీవించిన తరువాత అయినా మనం ఏ వృత్తిలో ఉన్నా కూడా భక్తిని హితవు చేసుకొని జాగ్రత్తగా పెంచుకొంటూ రావాలి. ఏదో ఇడ్లీ తిన్నట్లు, అన్నం తిన్నట్లు ఇది ఒక్క రోజులో రాదు. సత్పురుషుల సహవాసం చేస్తూ, ఎప్పుడైనా దగ్గరలో ఉన్న గుడిలో పదినిమిషాలు కూర్చొంటూ, ఉపయోగపడే గ్రంథాలను చదువుకొంటూ, గొప్పలకు గౌరవాలకు వెళ్ళకుండా జీవిస్తూ సాధనా సంస్కారాన్ని నెమ్మదిగా పెంచుకోవాలి. ఇది జనంవలన, ధనంవలన వచ్చేదికాదు. జాగ్రత్తగా మనం అనాత్మను విడిచిపెట్టి ఆత్మను ధ్యానం చేసుకొంటూ చివరిరోజులు వచ్చేసరికి మనం ఏదికాదో దానితో తాదాత్మ్యం తగ్గించుకొని ఏదిఅవునో దాని దగ్గరకు జరుగుతూఉండాలి. రామకృష్ణపరమహంసగారు భోదిస్తూ భోదిస్తూ మధ్యలో ఆగిపోతూ ఉండేవారు. ఆయనకూడా ఎప్పుడూ మహేంద్రనాథ్ గుప్తా అని ఒక రిటైర్డ్ హెడ్‌మాష్టారు ఉండేవారు. ఏమిటి గుప్తా నన్ను ఏమి చెప్పమంటారు మీకు. నాకో శరీరం ఉందని మరుపు వచ్చేస్తోంది. ఇలా మరుపు వస్తూ ఉంటే నేను మీకు ఏమి భోదిస్తాను అనేవారు. మహేంద్రనాథ్! నాలో ఏదైనా కొంచెం అహంకారం మీకు కనిపిస్తోందా? అసలు అహంకారం లేకుండా నేను ఉన్నానా? అంటే నూటికి నూరు పాళ్ళు అహంకారం లేకుండా మీరు లేరు, కొంచం కనిపిస్తోంది అన్నారు హెడ్‌మాష్టారు. మీరు అవతారపురుషులు, దానిని మీరు పోగొట్టుకోవాలంటే పోగొట్టుకోగలరు కాని మాకు భోదించటానికి ఆ తెరను అడ్డుపెట్టుకొంటున్నారు అని చెప్పారు. మహేంద్రనాథ్ గుప్తా! నాకు ఎంతోకొంత అహంకారం ఉందని నువ్వు చెపుతున్నావు, అది నిజమే. కాని అది నేను అట్టి పెట్టుకోవటం లేదు, దేవుడే కావాలని అట్టిపెట్టాడు. ఆ చిన్న తెర లేకపోతే మీకు భోదించేవాడు ఎవడూ కనబడడు. నేను అట్టిపెట్టుకొన్నానని నువ్వు చెపుతున్నావు, నాకెందుకు వాడే

అట్టిపెట్టాడు, మీకు భోదించటానికి ఈశ్వరుడు నన్ను అలా తొక్కిపెట్టాడు.

మీకు చివరిశ్వాసలో ఏ తలంపు అయితే ఉందో దానికి అనుకూలమైన జన్మ వస్తుంది అని పరమాత్మ చెప్పాడు, అంటే అది నీకు పరీక్ష టైము, ప్రాణం పోయే టైములో ఏ ధ్యాసలో ఉన్నావు అనేది పరీక్ష, దానిని బట్టి జన్మ వస్తుంది. భాగవతంలో అజామీళుడు అనేవాడి గురించి వస్తుంది. వాడు పెద్ద భక్తుడు కాదు. వాడి కొడుక్కి నారాయణుడు అని పేరు పెట్టుకొన్నాడు. వాడు చివరి రోజులలో మంచం పట్టాడు. వాడికి ఏదైనా కావలసివస్తే నారాయణ, నారాయణ అనేవాడు. అందుకే భగవంతుడి పేరు పెట్టుకొంటారు. చివరకు వాడి ప్రాణం పోయేటప్పడు కూడా నారాయణ, నారాయణ అంటూ చనిపోయాడు. చివరలో ఏదో రూపంలో నారాయణ స్మరణ వచ్చింది కాబట్టి వాడికి ఉత్తమలోకం వచ్చింది. జీవితం పొడుగునా జపాలు చేసి, ధ్యానాలు చేసి, త్యాగాలు చేసిన మహాత్ముడు ఒకడు ఉండేవాడు, వాడి పేరు జడభరతుడు. ఎన్ని ఉపవాసాలు చేసేవాడు అంటే సంవత్సరం పొడుగునా అన్నం తినేరోజులు తక్కువ, అన్నం తినని రోజులు ఎక్కువ ఉండేవి. ఎప్పడు ఈశ్వరధ్యానంలో ఉండేవాడు. చివరిరోజులలో ఏమైంది అంటే వాడు ఒక కుంటి లేడిని చూసాడు, దాని ప్రాణం పోతూ ఉంటే రక్షించాడు, దానికి ఒక పిల్ల ఉంది. మామూలుగా ఆయన జపం చేసుకొంటూ, వాటికి తిండి పెడుతూ ఉండేవాడు. కాని ప్రాణం పోయేటైములో వాటి ధ్యాస విడిచిపెట్టలేక నేను ఇంతకాలం చూసాను, ఈ లేడిని, లేడిపిల్లను ఎవరు చూస్తారు అనుకొంటూ నారాయణ నారాయణ అనే బదులు లేడి లేడి అనుకొంటూ ప్రాణం విడిచిపెట్టాడు. వాడికి వ్యామోహం అలా వచ్చింది. చివరలో ఆ లేడి గొడవ రావటం వలన వాడికి తరించటానికి ఇంకో రెండు జన్మలు పట్టింది. చివరి రోజులలో మనం లోపల ప్రిపేర్ అవుతూ ఉండాలి. జీవితం పొడుగునా మనం కష్టపడి సాధనలు చేసినా చనిపోయే టైములో ప్రకృతివాసన వచ్చేస్తే మరల తదనుగుణమైన జన్మ వచ్చేస్తుంది. అందుచేత తలంపుల విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి.

భగవంతుడు విశ్వాత్ముడు. ఆయన మీ హృదయంలో ఉన్నాడు, నా హృదయంలో ఉన్నాడు, ప్రపంచం అంతా వ్యాపించి ఉన్నాడు. మనో దేహములతో సంబంధం లేకుండా, గుణాలతో సంబంధం లేకుండా అందరి హృదయాలలో ఏ చైతన్యం అయితే ఉందో, ఏ ఆత్మ అయితే ఉందో అదే విశ్వాత్మ. నువ్వు నాలో కూడా ఉన్నావు కదా. నువ్వు నాకు వేరుగా ఉన్నంత సేపు ఏదో అడగాలని అనిపిస్తూ ఉంటుంది. నువ్వు నాకు స్వరూపంగా వ్యక్తమైతే వేరుభావన నశిస్తుంది, అప్పడు నాకు అమృతానుభవం కలుగుతుంది. భగవంతుడు మన మాటను చూడడు, మన హృదయాన్ని చూస్తాడు, మన సాధన, సంస్కారం చూస్తాడు. మనం ఒకటి నేర్చుకోవాలి. మన ఇంట్లో అందరం ఒక రోజు చనిపోము. ఎవరికి టైము వచ్చినప్పడు వారు పోతూఉంటారు. వారు వెళ్ళిపోయినప్పడు మనకు దుఃఖం రాకుండా

ఈలోపుగా మనం ప్రిపేర్ అవుతూ ఉండాలి.

నేను అనేది ఒక తలంపు, నాది అనేది ఒక తలంపు. ఈ రెండు తలంపులు ఉన్నంత కాలం వాడు శవాలను మోస్తూఉండవలసిందే, వాడు సంసారంలో నుండి బయటకు వచ్చే అవకాశం లేదు. ఈ రెండు తలంపులు వచ్చాకే మిగతా తలంపులు అన్నీ వస్తాయి. మనలను ఎవరు సంకెళ్ళు పెట్టి స్థంబానికి కట్టేయనక్కరలేదు. మొదట నేను అనే తలంపు వస్తుంది, అది రాగానే దేహానికి చుట్టేస్తుంది. తరువాత నాది అనే తలంపు వస్తుంది, అది మన దేహానికి సంబంధించిన వాళ్ళతో ముడివేసేస్తుంది. ఈ రెండు తలంపులు ఉన్నంతకాలం మీరు చనిపోయి మంచిలోకాలకు వెళ్ళినా, చెడులోకాలకు వెళ్ళినా సంసారం మిమ్మల్ని విడిచిపెట్టదు, ఇందులో రాజీలేదు. ఈ రెండు తలంపులు విడిచిపెట్టకుండా మీకు స్వర్గరాజ్యం వచ్చేస్తుంది, నిర్వాణసుఖం వచ్చేస్తుంది అని చెప్పి మిమ్మల్ని నేను మోసం చేయలేను. మనం ప్రిపేర్ అవ్వటం ఎలాగ అంటే ప్లీడరుగారు ఉన్నారు అనుకోండి, మన లోపల ఏ ఈశ్వరుడు అయితే ఉన్నాడో ప్లీడరు గారిలో కూడా ఆయనే ఉన్నాడు. ఆయన రూపం, ఆయన గుణాలు ఇవి ఏమీ ఆయన కాదు. అందుచేత ప్లీడరు గారిని చూసేటప్పుడు ఆయన రూపాన్ని, గుణాలను చూడకుండా ఆయన లోపలఉన్న ఈశ్వరుడిని చూడటం నేర్చుకోవాలి ఎందుచేతనంటే ఈశ్వరుడు ఒక్కడే నిజం, ప్లీడరుగారి రూపం, గుణాలు నిజం కాదు. ప్లీడరుగారు జీవించి ఉండగా ఆయన లోపలఉన్న ఈశ్వరుడిని చూడటం నేర్చుకొంటే, ప్లీడరుగారు దేహం ఉన్నప్పుడు ఎలా ఉంటామో, ఆయన దేహం పోయినా అలానే ఉండగలము. మన కుటుంబసభ్యులు అయినా అంతే. వారు రకరకాలుగా ఉంటారు. వారి రూపాలను, గుణాలను చూడకుండా అంతర్యామిగా ఉన్న పరమాత్మను చూడటం నేర్చుకొంటే వారు బతికి ఉన్నప్పుడు ఎలాగ ఉంటామో వారు చనిపోయినా అలాగే ఉంటాము. మన దేహప్రారబ్ధాన్ని బట్టి కుటుంబసభ్యులు సిద్ధమవుతారు, అది ఈశ్వరుడు నియమిస్తాడు, వాడే పురుషుడు. పురుషుడు అంటే మగవాళ్ళు అని కాదు, పురములో అంతర్యామిగా ఉన్నవాడు. వాడే పరమాత్మ.

మన ఇంట్లోమనుషులు కూడా రకరకాల గుణాలతో ఉంటారు. వారితో వెళ్ళి కలిసిపోవద్దు, వారిపట్ల నీ డ్యూటీ చెయ్యి, నీ హృదయాన్ని నాకు ఇయ్యి, నన్ను ప్రేమించు, నా నామాన్ని జపించు, నీకు మోక్షదాతను నేనే, నేను ఏ పని చేయమన్నానో అది నీకు ఇష్టం లేకపోయినా హితవుచేసుకొని చెయ్యి, నన్ను గౌరవించు, ఇలా చెయ్యగా చెయ్యగా మీ ఇంట్లో వారి మీద ఇష్టం తగ్గుతూ ఉంటుంది, నామీద ఇష్టం పెరుగుతూ ఉంటుంది. అలా నా మీద ఇష్టం పెరగగా, పెరగగా కొంతకాలానికి మీరు పవిత్రులు అవుతారు, మీకు ఏకాగ్రత కలుగుతుంది, మీరు నా స్వరూపాన్ని పొందుతారు. నా హృదయంలో ఏ నిజం అయితే ఉందో మీ హృదయంలో కూడా అదే ఉంది. మీరు నన్ను ప్రేమిస్తూ ఉంటే దానిని వంపు

పెట్టుకొని మీ హృదయంలో ఉన్న నిజానికి మీ కళ్ళు తెరిపిస్తాను, అదే మీకు కడసారి జన్మ అంటున్నాడు పరమాత్మ. మీ హృదయంలో ఉన్న నిజమే శరీరం ధరించి మీకు భోదించటానికి వచ్చింది కాని కర్మను అనుభవించటానికి వచ్చిన దేహం కాదు. మనం పూర్వజన్మలో చేసిన కర్మ బ్యాంక్‌లో ఉంటుంది, అది ఇప్పుడు అనుభవిస్తున్నాము. ఇప్పుడు మరల కర్మ చేస్తున్నాము, అది బ్యాంక్‌లో పడుతుంది, వచ్చే జన్మలో అనుభవిస్తాము. నాకు అనుభవించటానికి బ్యాంక్‌లో కర్మ లేదే అంటున్నాడు పరమాత్మ. ఈ లోకంలో నేను పని చేసి సంపాదించవలసింది అంటూ ఏమీ లేదు. ఏదో నాకు లేకపోతే కదా కొత్తగా సంపాదించటానికి, పరమాత్మ అంటే అంతా తానే. అంతా తానే అయినవాడికి ఇంక కొరత ఏముంటుంది. అయినా ఎందుకు పనిచేస్తున్నాడు అంటే లోక కళ్యాణం కోసం, ఈ జీవకోటిని మోక్షం వైపుకు తిప్పటంకోసం పనిచేస్తున్నాడు. వాడు దేవుడు.

ఉన్నది ఈశ్వరుడు ఒక్కడే. ఆయనకు భిన్నంగా ఏదీ లేదు. ఆయనకు తెలియకుండా ఏదీ జరగటం లేదు. జరిగేదంతా ఆయన సంకల్పం, అనుకొనేది మన సంకల్పం. నీకు నేను అనే తలంపు, నాది అనే తలంపు ఉన్నంతకాలం ఈ విషయం నీకు ఎన్ని సార్లు చెప్పినా అది నీకు అర్థం కాదు, నీ బుద్ధికి స్పష్టతరాదు. మీరు ఒకటి గుర్తు పెట్టుకోండి. మీ గురువులు ఎవరైనా, మీరు ఏ మార్గంలో ప్రయాణం చేస్తున్నా, మీరు ఏ మతంలో ఉన్నా, నిష్కామకర్మ చేసినా, గుడులు చుట్టూ తిరిగినా, ఏ సాధనలు చేసినా వీటి అన్నింటి యొక్క ప్రయోజనం ఏమిటి అంటే నేను, నాది అనే ఈ రెండు తలంపులు తగ్గించుకొంటూ రావాలి. నేను అనే తలంపు వచ్చింది అనుకోండి ఈ శరీరాన్ని చుట్టేసుకొంటుంది. ఫలానా రూపం నాది, ఫలానా నామం నాది, ఫలానా వృత్తి నాది, నేను అంతటి వాడిని అని ఇలా ఏదో ఒకటి నువ్వు కానిదానితో చుట్టబెట్టేసుకుంటుంది. ఇలా నువ్వుకానిదానితో చుట్టబెట్టేసుకొని, నువ్వు ఏదిగా ఉన్నావో దాని తాలుక ఎరుక లేకుండా కోట్లాది జన్మలు కొట్టుకొనిపోతావు. గురువు అంటే మన నిజమైనఇంటికి మనలను తీసుకొని వెళ్ళేవాడే గురువు. మిమ్మల్ని ఎవరో తీసుకొని వెళ్ళి దట్టమైన అడవిలో వదిలేసారు అనుకోండి. ఇల్లు మనది అయినా మన ఇంటికి మనం రాలేము. ఆ అడవిలో నుండి ఎవడో ఒకడు మనకు దారి చూపించాలి. అజ్ఞానం మనలను తీసుకొని వెళ్ళి కటికచీకటిలో వదిలేసింది. లోతుగా పాతుకుపోయిన అజ్ఞానంలో నుండి, అవిద్యలోనుండి మనలను బయటకు తీసుకొని వచ్చి మన నిజమైన ఇంటికి మనలను జేర్చేవాడే గురువు. ఈశ్వరానుగ్రహం మనలను ఉద్ధరించాలనుకొంటే సునామీ కిందవచ్చి ఉద్ధరిస్తుంది. మహాచైతన్యం ఒక సునామి కింద వచ్చి మనలను అనుగ్రహించి హృదయంలో ఉన్న నిజంలోనికి మేల్కొనేటట్లు చేయాలిగాని దైవానుగ్రహం ముందు మనం 90 జన్మలలో 90 రకాల సాధనలు చేసినా, పూజలు, జపాలు చేసినా ఇవి అన్నీ ఆ మహాఅనుగ్రహం ముందు ఎందుకు పనికిరావు. ఒక్క క్షణం మనలో ఉన్న మహాచైతన్యం సునామి కింద వచ్చి మనలను స్వాధీనం చేసుకొంటే ఒక్క జంప్‌లో మనలను అజ్ఞానంలో నుండి

జ్ఞానంలోనికి, అసత్యంలోనుండి సత్యంలోనికి గెంటేస్తుంది. ఇక్కడ పరమాత్మ ఏమని చెపుతున్నాడు అంటే నన్ను ప్రేమించమని ఎందుకు అడుగుతున్నాను అంటే నన్ను ప్రేమిస్తూ ప్రేమిస్తూ బయట ఆకర్షణలను తగ్గించుకొని ఈశ్వరుడిపట్ల ఆకర్షణ పెంచుకొంటే నీ హృదయంలో ఉన్న నిజం దగ్గరకు చేరుకొంటావు. అందుకు నన్ను ప్రేమించమని అడుగుతున్నాను.

మీకు నెగిటివ్‌తింకింగ్ వద్దు. మీరు పాజిటివ్‌గా మాట్లాడండి, పాజిటివ్‌గా ఆలోచించండి, మీ జీవితవిధానం అంతా పాజిటివ్‌గా ఉండాలి, అదే నిజమైన సాధన. మన శరీరం చనిపోయాక బంధువులతోటి, స్నేహితులతోటి, విరోధులతోటి, పరిసరాలతోటి అందరితోటి సంబంధం తెగిపోతుంది. ఒక్క గురువుతో తప్పించి అన్నింటితోటి సంబంధం తెగిపోతుంది. గురువు అంటే ఆత్మ. మనం ఆత్మ అయి ఉన్నాము. మనం ఏదిగా ఉన్నామో అదే గురువు కాబట్టి దాని గుర్తింపు వచ్చేవరకు ఆ జన్మకు ఆజన్మ మనలను వెంటాడుతూ ఉంటాడు. ఆయనకు పనిలేకపోయినా మనతో మాట్లాడుతూ, మనతో తిరుగుతూ మనకు తెలియకుండా మన మనస్సును హృదయగుహలోనికి నెట్టేస్తాడు, వాడు గురువు. భగవంతుడిని జపిస్తున్నాము, భగవంతుడిని ప్రార్థిస్తున్నాము అయినా, మాకు సంతృప్తి కలగటం లేదు అని భగవాన్‌తో అంటే భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే నువ్వు ఏ భగవంతుడినైతే జపిస్తున్నావో వాడు నిజంగా ఉన్నాడనే విశ్వాసం నీకు ఉందా? ఎందుకీ బుడబుక్కల మాటలు. దేవుడనే వాడు ఒకడు ఉన్నాడు అనే నమ్మకం నీకు పూర్తిగా కుదరాలి. గీతలో పరమాత్మ ఏమని చెప్పాడు అంటే ఒకడు ఎంత అనాచారి అయినప్పటికీ, వాడికి ఎన్ని చెడుగుణాలు ఉన్నప్పటికీ భగవంతుడనే వాడు ఒకడు ఉన్నాడు అని సజీవమైన విశ్వాసం ఉన్నవాడు సాధనలు చేసేవారికంటే ముందు బాగుపడతాడు. ఈ గుడులు, గోపురాలు కట్టించిన వారికంటే ముందు బాగుపడతాడు. మనం నోటితో దేవుడు ఉన్నాడని చెపుతాము, హృదయంతోటి లేడు అంటాము.

మనుషులకంటే పశువులు మెరుగు అని ఈమధ్య ఒక పశువుల డాక్టరుగారు నాతో చెప్పారు. మీరు వంద ఎకరాలు సంపాదించి ఇచ్చినా వారికి కృతజ్ఞత ఉండదు, మేము ఎప్పడైనా వాటి రోగం తగ్గిస్తే, ఎప్పడైనా తెలగపిండి పెడితే మమ్మల్ని చూసి కళ్లనీరు కారుస్తాయి. పశువులకు ఉన్న కృతజ్ఞత మనుషులకు ఉండదు అని చెప్పారు. ఉన్నదేదో ఉంది. అది మన కళ్లకు కనబడటం లేదు, మన బుద్ధికి అందటం లేదు కాబట్టి అది ఉన్నా లేదు అనుకొంటున్నాము. జ్ఞానం అంటే ఏమిటి అంటే ఉన్నదేదో ఉంది, ఉన్న దానిని మనం కనిపెట్టనక్కర లేదు, ఉన్నది ఉన్నట్లుగా మీరు అనుభవంలోనికి తెచ్చుకోవటమే జ్ఞానం. అప్పటివరకు మనం కోటి జన్మలు ఎత్తినా అజ్ఞానంలో నుండి జ్ఞానంలోనికి రాలేము. ఆహారనియమం అవసరమని భగవంతుడు చెపుతున్నాడు. ఆహార నియమం ఎందుకు

అంటే ఆహారంలో నియమంగా ఉన్నవాడు కామాన్ని జయిస్తాడు. సజ్జనసాంగత్యం ఎందుకు చెయ్యమని చెపుతున్నారు అంటే సజ్జనసాంగత్యం వలన జ్ఞానం సంపాదించాలనే జిజ్ఞాస కలుగుతుంది. నోటితో చెప్పిన మంచిమాటకాని, చేతితో చేసిన మంచిపనిగాని, మీకు వచ్చే మంచి తలంపులు గాని ఇవి ఏమీ వృథా అవ్వవు. ఒకవేళ వెంటనే మోక్షం రాకపోయినా, ఇదంతా వచ్చే జన్మలో సాధనకు మనకు కలిసివస్తుంది. భగవాన్ ఏమి చెప్పారు అంటే స్వప్నం పొట్టిగా ఉంటుంది. జాగ్రదవస్థ పొడుగ్గా ఉంటుంది కాని ఇదెంత అబద్ధమో, అది కూడా అంతే అబద్ధం. మెలుకువలో నిద్రపోవటం నేర్చుకోండి మీకు తొందరగా జ్ఞానం కలుగుతుంది. మీకు ఉన్నవస్తువు ఉన్నట్లుగా తెలిసేవరకూ లేనిది ఉందనుకోవటం మానరు. ఒకవేళ ప్రారబ్ధకర్మ మిమ్మల్ని మొట్టికాయలు మొట్టినా ఉన్నది ఉన్నట్లుగా మీకు వ్యక్తమయ్యేవరకు లేనిది ఉందనుకోవటం మనం మానము. అజ్ఞానాన్ని జ్ఞానం అనుకొంటాము, మంచికాని దానిని మంచి అనుకొంటాము, ఏదైతే మనకు శాంతి ఇవ్వదో అది శాంతి ఇస్తుంది అని అనుకొంటాము, చివరకు పరిణామంలో మనకు అశాంతి మిగులుతుంది. పరమాత్మను తెలుసుకొనే వరకు ఈ జీవకోటికి శాంతి లేదు.

నదులు వెళ్ళి సముద్రంలో చేరిపోయాక అమ్మయ్య మన ప్రయాణం పూర్తి అయిపోయింది అని ఎలా అనుకొంటాయో అలాగే నీ హృదయంలో అంతర్యామిగా ఉన్న పరమాత్మలో ఐక్యంఅయ్యేవరకు ఈ ప్రయాణం ఆగదు, అప్పటివరకు ఒడ్డుకు వచ్చాము అనుకోవటానికి వీలులేదు. అజ్ఞానంలో ఉన్న మనిషి ఎంత ప్రయత్నం చేసినా జ్ఞానాన్ని అర్థం చేసుకోలేడు. మీరు అందరూ పచ్చగా ఉన్నారు అనుకోండి, మీ ఇంటి చుట్టూ వంద కార్లు, సొంత విమానాలు ఉన్నాయి అనుకోండి. ఇవన్నీ పెట్టుకొని భగవంతుడిని మర్చిపోతే మీకు వచ్చేది సున్న. ఇవన్నీ మీకు లేవు అనుకోండి, మీరు కష్టాలు పడుతున్నారు అనుకోండి, ఇంట్లో ఇబ్బందులు పడుతున్నారు అనుకోండి, ఈ కష్టాలు, బాధలు మీ మనస్సును భగవంతుడివైపుకు తిప్పుతున్నాయి అనుకోండి దానికంటే ఇది గొప్ప, ఎందుచేతనంటే భగవంతుడు శాశ్వతం, మిగతావి అన్నీ అశాశ్వతం. మీ కార్లు, విమానాలు అన్నీ స్వప్న సమానం. మీరు ఎవరినైతే ప్రేమిస్తున్నారో, ఎవరికోసమైతే జీవిస్తున్నారో ఒకోసారి వారే మీకు ఎదురు తిరుగుతారు. వారు ఎదురు తిరిగి మిమ్మల్ని మొట్టికాయలు మొడితేగాని మీ మొఖం భగవంతుడివైపుకు తిరగదేమో అని వారిచేత మొట్టిస్తాడు, వాడు భగవంతుడు.

మీకు అశాంతి వస్తే కంగారుపడకండి, దుఃఖంవస్తే కంగారుపడకండి. భగవంతుడు నన్ను వదిలేసాడా, నా గురువు నన్ను వదిలేసాడా అని మీరు అనుకొంటారు. ఇంతకాలం నేను నమ్మిన గురువు ఎక్కడికి పోయాడు అని మీరు అనుభవించే అశాంతిలో, ఆ బాధలో వారిని పట్టుకొని తిడతారు. మీరు పూజించే దేవుడు ఎప్పుడైనా తాత్కాలికంగా మీకు అశాంతి తీసుకొనివచ్చినా ఆయనకు తెలియకుండా మీకు అశాంతి రాలేదు, దుఃఖం రాలేదు. ఇదంతా

ఆయనకు తెలిసే జరుగుతోంది. ఇవన్నీ ఎందుకు మీకు చూపిస్తున్నాడు అంటే మిమ్మల్ని వదిలేయటానికి కాదు, ఆయన ఒడిలోనికి మిమ్మల్ని తీసుకోవటానికే ఈ ప్రక్రియలు అన్నీ చేస్తున్నాడు, అది మీకు తెలియక గురువును పట్టుకొని తిడుతున్నారు. చిన్నపిల్లలను చూడండి, మీరు ఎత్తుకొన్నప్పుడు మిమ్మల్ని కాళ్ళతో తన్నుతారు, మీమీద మూత్రవిసర్జన చేస్తారు, అలాగని వారిని కిందపడేయరు. అలాగే మీరు భగవంతుడిని తిట్టినా, ఏది చేసినా కూడా ఆయన మిమ్మల్ని కింద పడేయడు, ఆయన ఒడిలోనికి తీసుకొంటాడు, వాడు దేవుడు. జ్ఞానం గురించి ఆయన చెప్పటంకాదు, ఇవ్వటమే. గురువు వేరు ఆత్మ వేరుకాదు, గురువు వేరు జ్ఞానం వేరుకాదు, గురువు వేరు దేవుడు వేరుకాదు. అయితే గురువు యందు మనకు భక్తి కలగటం కష్టం ఎందుచేతనంటే ఆయన మన కళ్ళఎదుట కనిపిస్తూ మనతో కలిసి తిరుగుతూ ఉంటాడు. మనందరమూ పెద్ద ధనవంతులము కాకపోయినా తినటానికి తిండి, ఉండటానికి ఇల్లు, కట్టుకోవటానికి బట్ట అన్నీ ఉన్నాయి. అయితే మనం సుఖంగా, శాంతిగా ఎందుకు ఉండలేకపోతున్నాము. లోకంలో సుఖం లేదు, శాంతి లేదు. ఎక్కడ సుఖం ఉందో, ఏ బ్రహ్మపదార్థంలో జ్ఞానం ఉందో, శాంతి ఉందో దాని తాలుక ఎరుక మనకు కలిగేవరకు కోటిజన్మలు ఎత్తినా మనకు అశాంతి విడిచిపెట్టదు, దుఃఖం విడిచిపెట్టదు. శాంతి నీ హృదయంలోనే ఉంది.

లోకం అనిత్యం, లోకంలో ఉన్నది అశాంతి, దుఃఖం. లోకంలో నీకు ఏదైనా సంతోషం కలిగిస్తున్నట్లు కొన్ని విషయాలు కనిపించినా ఏనాటికైనా అవి అన్నీ దుఃఖంగా మారిపోవును. నువ్వు నిరంతరం భగవంతుడిని స్మరిస్తూ ఉంటే నీ దుఃఖం అంతా సుఖముగా మారిపోవును. నువ్వు భగవంతుడిని స్మరించకుండా కేవలము విషయాలనే స్మరిస్తూ ఉంటే నీ సుఖం అంతా దుఃఖంగా మారిపోవును, ఇది నిశ్చయము. బైటగొడవలను మీ మనస్సులోనికి తీసుకోవద్దు, బైటగొడవలు అన్నీ బైటే వదిలేయండి. లోకంలో నుండి వచ్చే సంతోషాలను, దుఃఖాలను లోపలకు తీసుకొంటే ఆ మోత మీరు మోయలేరు, అవుట్‌సైడ్ గొడవలవలన జ్ఞానంరాదు, వాటిని లోపలకు తీసుకోవటం వలన అజ్ఞానం పెరిగిపోతుంది. నువ్వు కంగారుపడవద్దు. నీ దేహం ప్రారబ్దాన్నిబట్టి నడిచివెళ్ళిపోతూ ఉంటుంది, నీ మనస్సును దేహంతో కలపకు, నీ మనస్సును ఈశ్వరుడిలో ఐక్యం చెయ్యి. నీ మనస్సును దేహానికి అప్పగించవద్దు, నీ మనస్సు ఏ చైతన్యంలో నుండి వచ్చిందో, ఏ ఆధ్యాత్మికహృదయంలోనుండి వచ్చిందో దానిని అక్కడకు నెట్టటానికి ప్రయత్నం చెయ్యి. నీ దేహప్రారబ్దాన్ని బట్టి సంతోషం వచ్చింది అనుకో, ఇది నిత్యం కాదు అనుకో, దుఃఖం వచ్చింది అనుకో, ఇదీ నిత్యంకాదు అనుకో, నా దేహమే నాది కానప్పుడు ఏది నాది అవుతుంది అన్నాడు బుద్ధుడు. నువ్వు శాంతిగా ఉండాలంటే ఎదుటివారు నీ గురించి ఏమనుకొంటున్నారు అనే గొడవ వదిలెయ్యి. ఎదుటివారు మనలను చెడ్డవారు అంటారు అనుకోండి, వారి గొడవ వదిలెయ్యండి. వారు

మిమ్మల్ని చూసి అసూయ పడుతున్నారు అనుకోండి, వారి గొడవలో వారిని ఉండనివ్వండి, దానిలో మీరు కలుగజేసుకోవద్దు. వారిపట్ల మీరు ఎలా ఉంటున్నారో చూసుకోండి. మీరు ఎదుటివారిని చెడ్డవారు అనుకొంటే నెమ్మదిగా మీరు కూడా చెడ్డవారు అయిపోతారు.

నీకు ఎవడిమీద అయినా కోపం ఉంది అనుకో వారు ఎప్పడైనా కనిపిస్తే కోపంగా చూడకు, ప్రేమగా చూడు. ఒకవేళ వాడిని ప్రేమగా చూడలేకపోతున్నావు అనుకో, నేను ప్రేమగా చూడమని చెపుతున్నాను కాబట్టి ప్రేమగా చూడు, నాకోసం వాడిని ప్రేమగా చూడు అంటున్నాడు పరమాత్మ. ఎంత అద్భుతమైన టీచింగ్. మీకు ఇష్టంలేని పని అయినా నాకోసం చేస్తున్నారు కాబట్టి మీకు ఏది మంచిదో మీకంటే నాకు ఎక్కువ తెలుసుకాబట్టి ఆ మంచిని నేను మీకు చేస్తాను, మీకు జ్ఞానాన్ని ప్రసాదిస్తాను, జననమరణచక్రం నుండి విడుదల చేస్తాను. మీరు ఎదుటివారి గురించి తప్పడుగా అనుకొంటూ ఉంటే అది సరిచేసుకోండి, అప్పడు మీ మనస్సు బాహ్యముఖానికి వెళ్ళటం మానేస్తుంది, వారు మీకు జ్ఞాపకం రావటం మానేస్తారు, అప్పడు మీకు పరమాత్మ చింతన పెరుగుతుంది. పరమాత్మను చింతించగా, చింతించగా అభౌతికమైన, అలౌకికమైన పరమశాంతి అనే దుప్పటితో మిమ్మల్ని కప్పతాను అంటున్నాడు పరమాత్మ. ఒకోసారి మనస్సుకు సంతోషం వస్తూ ఉంటుంది, ఒకోసారి దుఃఖం వస్తూ ఉంటుంది. మనస్సుకు సంతోషం వచ్చినా, దుఃఖం వచ్చినా అది మీరు కాదు కదా. మీరు దేహం అనుకొన్నా మీరు దేహంకాదు, మనస్సు అనుకొన్నా మీరు మనస్సు కాదు. మీరు కానిదాని చుట్టూ తిరుగుతూ మీరు చనిపోతున్నారు. గురువు తప్పించి, ఈశ్వరుడు తప్పించి మిమ్మల్ని ఉద్ధరించేవాడు ఎవడూ లేడు. మనం ఎవరిని చూసినా వారిలో అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడినే చూడాలి. అదే నిజమైన చూపు, మిగతావి అన్నీ దొంగచూపులు. మనం కర్మ చేస్తున్నాము. ఈ ప్రకృతిమనుషులను, ప్రకృతిగుణాలను సంతోషపెట్టే కర్మల వలన బంధాలు వస్తాయికాని మోక్షం రాదు. ఈశ్వరుడి దయ సంపాదించటం కోసమే మనం పని చెయ్యాలి.

లోపల పురములో ఉన్నవాడే పురుషుడు, వాడే చైతన్యం, వాడే పరమాత్మ. వాడిని మేము తెలుసుకోవాలి, వాటిని మేము పట్టుకోవాలి అంటే వాడు చిక్కడు, వాడు దొరకడు అంటున్నారు. మీకు దగ్గరైనట్లు ఉంటాడు పట్టుకొందాం అనుకొంటే పారిపోతూ ఉంటాడు. ఎవరి జీవితం అయితే చేదుగా లేకుండా, పుల్లగా లేకుండా, నూటికి నూరు పాళ్ళు తియ్యగా చేసుకొంటారో వారు కూడా నన్ను పట్టుకోలేరు, వారికి నేను పట్టుబడుతాను అంటున్నాడు పరమాత్మ. నూటికి 99 పాళ్ళు తియ్యగా ఉండి, ఒక వంతు చేదుగా ఉన్నా వారికి దొరికే సమస్య లేదు. ఇంక పులుపు లేదు, చేదు లేదు, అయ్యోపాపం వీరు నూటికి నూరుపాళ్ళు తియ్యగా ఉన్నారు, వారికి దొరకకపోతే ఎలాగ అని నాదయ వలన వారికి దొరుకుతాను గాని అప్పడు కూడా వారి తెలివితేటల వలన నేను దొరకను అంటున్నాడు పరమాత్మ. మనం

ప్రయత్నం చేసి సాధన చేసి చెయ్యి పట్టుకొందాము అని దగ్గరకు వెళితే చెయ్యి అందించినట్లే అందించి, పారిపోతూ ఉంటాడు. అందరి పురాలలోను పురుషుడు ఉన్నాడు కాని వాడు అందరికీ తెలియబడడు, వాడు ఎవరికి తెలియబడాలనుకొంటే వాడికి మాత్రమే తెలియబడతాడు. ఒక్కసారి మీ హృదయంలో ఉన్న పురుషుడు ఉబికి, ఈ జీవుడిని అజ్ఞానంలో నుండి ఒక్క గంతులో జ్ఞానంలోనికి తీసుకొనివస్తాడు, అది ఒక పెద్ద సర్జరీ, అయితే భగవంతుడు సర్జరీ చేయటానికి కత్తులు అక్కరలేదు, ఎక్స్‌రేలు అక్కరలేదు, మందులు అక్కరలేదు. వాడే డాక్టరు, వాడే కత్తి, వాడే మందు, అన్నీ వాడే. మనం ఎంత ప్రయత్నం చేసినా అనాత్మలో నుండి అసత్యంలోనుండి బయటకు రాలేము. ఎందుచేతనంటే ఇది కోట్లాదిజన్మలనుండి వచ్చే వాసన. కోట్లాదిజన్మల నుండి మనం అసత్యాన్ని సత్యం అనుకొంటున్నాము, అనాత్మను ఆత్మ అనుకొంటున్నాము. మన తెలివితేటల వలన, కుప్పిగంతుల వలన ఇందులో నుండి బయటకు రాలేము. భగవంతుడు సడన్‌గా సర్జరీ చేసి అసత్యంలోనుండి సత్యంలోనికి ఈడ్చేస్తాడు. నేను చనిపోతున్నాను అనే తలంపును బయటకు లాగి కాల్చి బూడిదచేసి చావులేనిస్థితిని ప్రసాదిస్తాడు. లోపలనుండి ఆ మహాచైతన్యం కెరటాలతో ఎగిసిపడి చీకటిలోనుండి వెలుగులోనికి, మృత్యువులో నుండి అమృతత్వంలోనికి లాగుతాడు. ఆయన లాగితేనేగాని మనం ఒడ్డుకు రాలేము. మన తెలివితేటల వలన చిన్న అలవాటులోనుండి, చిన్న వాసనలోనుండి బయటకు రాలేము. ఈశ్వరానుగ్రహం లేకుండా మన వల్ల ఏమీ జరుగదు.

ఈ గోవిందుడు అంటే పరాయివాడు అనుకొంటున్నారు. హృదయంలో ఉన్న పరమాత్మను నేనే, మీ హృదయంలో ఉన్న ఈశ్వరుడిని నేనే, మీ మరుపును నేను, మీ జ్ఞాపకాన్ని నేను, మీ ప్రాణానికి ప్రాణంగా ఉన్నవాడిని నేనే మీ లోపల అంతర్యామిగా ఉన్నవాడినే ఈ రూపం ధరించి వచ్చి చెబుతున్నాను అంటున్నాడు పరమాత్మ. ఇది అసాధ్యం, ఈ పని మన వల్ల అవ్వదు అని ఒకోసారి అనుకొంటాము. ఈశ్వరుడిని ప్రార్థిస్తే అది సాధ్యం చేసి పెడతాడు ఎందుచేతనంటే ఆయనకు అసాధ్యం అంటూ ఏమీ లేదు. ఆయన గోవర్ధన పర్వతాన్ని ఎత్తాడు, గొప్పల కోసం కాదు, జీవకోటికి ఉపకారం చెయ్యటానికి చేసాడు. అలాగే నువ్వు కూడా చెయ్యి. నువ్వు ఏదైనా చేస్తే ఈశ్వరుడి ప్రీతికోసం చెయ్యి. ముఖాలు చూసి చేయవద్దు, అక్కడ మతం వద్దు, కులం వద్దు, గుణం వద్దు, అంతర్యామిగా ఉన్న నన్ను చూస్తూ పనిచెయ్యండి, మీరు అజ్ఞానంలో నుండి బయటకు వచ్చేస్తారు అంటున్నాడు పరమాత్మ. భగవంతుడు ఇది మంచి పని అని చెప్పాడు అనుకోండి, మీ మనస్సు వద్దు వద్దు అని చెపుతోంది అనుకోండి, మీ మనస్సును ఒక ప్రక్కనపెట్టి భగవంతుడు చెప్పింది చెయ్యండి. భగవంతుడు చెప్పింది మీరు చేస్తున్నారు కాబట్టి ఆయన సంతుష్టుడు అవుతాడు, మీకు చిత్తశుద్ధి కలుగుతుంది, చిత్తశుద్ధి కలిగాక ఆత్మసిద్ధి కలుగుతుంది. మీరు ఇళ్ళ దగ్గర

కూర్చొని సోది చెప్పకోవద్దు, నా గురించి మాట్లాడుకోండి. భగవంతుడు యొక్క జన్మ, భగవంతుడి యొక్క వైభవం, ఆయన యొక్క లీలలు, ఆయన కళ్యాణగుణాల గురించి మాట్లాడుకొంటూ, పరస్పరం బోధించుకొంటూ ఆనందంగా ఉండండి అంతేగాని ఏడుపు ముఖాలు వేసుకొని సిద్ధమవ్వకండి.

అర్జునా! నీవు నేను ఏదో మాట్లాడుకొన్నాము, ఆ మాటలను శ్రద్ధగా అధ్యయనం చేసి, అర్థం చేసుకొని, ఆనందాన్ని అనుభవిస్తూ దానిని ఇతరులకు పంచిపెట్టేవాడిని చూసి నేను ఇష్టపడతాను, వాడు నాకు భక్తుడు, వాడిని నేను ప్రేమిస్తాను, వాడు నాకు అంతేవాసి అని చెపుతూ, వాడి గురించి ఇంకా వెలితిగా చెపుతున్నాను అని భగవంతుడికి అనిపించి గీతామృతాన్ని ఇతరులకు ఎవడైతే బోధిస్తున్నాడో వాడు నాకు భక్తుడు, వాడు మహాజ్ఞాని అని చెపుతూ చివరికి ఏమని చెప్పాడు అంటే వాడే నేను, నేనే వాడు, వాడికి నాకు భేదం లేదు, ఒక మహాజ్ఞానికి పెట్టే నమస్కారం నాకే అందుతుంది. జ్ఞానంతోటి సమానమైనది ఈ లోకంలోగాని, పరలోకంలోగాని లేదు. అట్టి జ్ఞానాన్ని సముపార్జించటానికి గురువును ఆశ్రయించి జ్ఞానాన్ని పొందు అంటున్నాడు పరమాత్మ. మీరు కాలక్షేపం కోసం ప్రకృతిగుణాల గురించి చెప్పకోవద్దు. ప్రకృతి గుణాల గురించి మాట్లాడుకొంటూ ఉంటే ప్రకృతిలో కూరుకొనిపోతారు, మహాచీకటిలో కూరుకొనిపోతారు. మీరు యజ్ఞాలు చేసినా, వేదాలలో మంత్రాలు చదివినా, నిష్కామకర్మ చేసినా, గుడులు చుట్టూ తిరిగినా, ఎన్ని సాధనలు చేసినా ఇవన్నీ నన్ను తెలుసుకోవటానికే, వీటి అన్నింటి గమ్యం నేనే, అది మర్చిపోవద్దు అంటున్నాడు పరమాత్మ. వాడే గోవిందుడు, వాడే నారాయణుడు. భగవంతుడు చెప్పిన శాంతిలో మీరు ఊగిసలాడుతూ ఉంటే మీకు ప్రాణవాయువు అందదు, శాంతిలో మీరు ఉక్కిరిబిక్కిరి అయిపోతారు. మీకు కోరికలు నెరవేరినప్పడు కూడా మీరు కొంతశాంతిగా ఉంటారు, అది అటువంటి శాంతికాదు, అది అలౌకికమైనది, అభౌతికమైనది. అందులో మీరు ఊగిసలాడేటప్పడు మీ శరీరానికి చావు వచ్చినా మీకు ఎర్రచీమ కుట్టినట్లుగా కూడా ఉండదు, అయ్యో శరీరం పోతోంది అని కూడా మీకు అనిపించదు. భగవదనుభవంలో నీవు పొందే శాంతి అట్టిది.

మీకు ఏదైనా సంతోషం వచ్చింది అనుకోండి, ఇది కూడా కాలప్రవాహంలో కొట్టుకొనిపోతుంది అనుకోండి మీకు ఏదైనా దుఃఖం వచ్చింది అనుకోండి, ఇది కూడా కాలప్రవాహంలో కొట్టుకొనిపోతుంది అనుకోండి. ఎప్పడూ ఉండేది, కాలానికి అతీతంగా, ప్రాంతానికి అతీతంగా, చావుపుట్టుకలకు అతీతంగా ఉండేది ఎవరు? ఈశ్వరుడు ఒక్కడే. ఆయన పాదాలను ఆశ్రయించండి, ఆయనను గౌరవించండి, ఆయనను పూజించండి, ఆయనను విశ్వసించండి. మీకు ఏది మంచిదో అది ఆయనే చేస్తాడు. కృష్ణుడు దేవుడు అని ధుర్యోధనుడికి తెలియదు, భీష్ముడికి తెలుసు. అవతారపురుషుడు భూమి మీదకు

వచ్చినప్పుడు వాడు అవతారపురుషుడు అని అందరికీ తెలియదు. జ్ఞానం తాలుక వైభవం లేనివారు, సాధనా సంస్కారం లేనివారు, సహృదయం లేనివారు అవతారపురుషుడిని గుర్తించలేరు, అవకాశాన్ని కూడా వదిలేస్తారు. ఏదో రమణమహర్షిగారిని దర్శించుకొంటే కోరికలు నెరవేరతాయని కొంతమంది అనుకోవచ్చు, ఏదో మహాత్ముడిని చూసివద్దాము అని కొంతమంది అనుకోవచ్చు. ఆయన కుమారస్వామి అంశతో జన్మించాడు, ఆయన మహాజ్ఞాని అని ఏదో ముగ్గురు, నలుగురికి తప్పించి తెలియదు, ఒకవేళ తెలుసు అని అనుకొన్నా తెలియదు అని గణపతిశాస్త్రిగారు చెప్పారు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 13-12-2007, పాలమూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

కొంతమందికి ఆలోచనే ప్రధానం, వివేకమే ప్రధానం. మన జీవితం వివేకవంతంగా ఉంటే మన శరీరం కూడా నీడ ఎలా వస్తుందో అలాగే మనకూడా ఆనందం వస్తుంది. మనం జీవితంలో నేర్చుకోవలసింది ఏమిటి అంటే గౌరవాలకోసం, గొప్పలకోసం ఏపనీ చేయకూడదు. మీకు నేను ఏదైనా సహాయం చేసాను అనుకోండి దానివలన నాకు సంతోషం రావాలి, మీకు సంతోషం రావాలి. గొప్పలకోసం, గౌరవాలకోసం చేస్తే ఇచ్చినవాడు సుఖపడడు, తీసుకొన్నవాడు సుఖపడడు. గౌరవాలకోసం ఏదైనా మంచి పనిచేసినా దాని వలన పుణ్యం రావచ్చు గాని చిత్తశుద్ధి రాదు, మనస్సుకు నిర్మలత్వం రాదు. ఈ మధ్యన ఒక భక్తుడు నా దగ్గర ఏమన్నాడు అంటే నాకు జనం వద్దు, ధనం వద్దు, గౌరవం వద్దు, చదువు వద్దు, ముక్తి కూడా అక్కరలేదు భగవంతుడి పాదాలయందు భక్తి ఉంటే చాలు అన్నాడు. ఆ భక్తి పర్యవసానంగా ఆయన ముక్తిని యిస్తే ఇవ్వవచ్చు కాని దానికి సంబంధించిన కోరిక మటుకు లేదు అంటున్నాడు. నేను భగవంతుడిని ప్రార్థించేది ఏమిటి అంటే నాకు మోక్షాన్ని ప్రసాదించమని అడగటం లేదు, నీ పాదాలయందు భక్తిని ప్రసాదించు అని అడుగుతున్నాను. భక్తి అనేది నా చేతికి సంబంధించిన పని, ముక్తి అనేది ఆయన చేతిలో పని. నాచేతిలో ఉన్న పనిని శ్రద్ధగా, గౌరవంగా చేస్తాను. అంతేగాని భగవంతుడి చేతిలో ఉన్న పనిలో నేను కలగజేసుకోను. నాకు ముక్తి కావాలని అడిగితే భగవంతుడు చేసే పనిని బలవంతం చెయ్యటం. ముక్తిమీద నా మనస్సు ఉంటే భక్తిని మర్చిపోతాను, వర్తమానకాలం జారిపోతుంది అంటున్నాడు. జీవకోటి అంతా గుణాలచేత ఆడించబడుతోంది. వారికి వారి గుణమే ప్రధానం, వారి అలవాట్లే ప్రధానం కాని భగవంతుడి మాట ప్రధానం కాదు. నేను వారిని బుజాన వేసుకొని తిరగటంలేదు, నాకు భగవంతుడు తప్పించి ఈ జనాల గొడవ అక్కరలేదు అంటున్నాడు.

మనస్సులో గుణాలు ఉన్నాయి, శరీరంలో రంగులు ఉన్నాయి. ఈ గుణాలతో, రంగులతో సంబంధం లేకుండా, అన్ని కాలాలలో, అన్ని అవస్థలలో ఈ జీవకోటికంతటికి ఆధారంగా ఒక చైతన్యం ఉంది. మనం గుర్తించినా, గుర్తించకపోయినా చైతన్యం ఉన్న

మాట నిజం. అది గుర్తించినవారు ధన్యులు, వారు భక్తులు అవుతారు. ఆ చైతన్యాన్ని దృష్టిలో పెట్టుకోవాలిగాని ఈ గుణాలతో తిరిగే జనాన్ని ఆదర్శంగా పెట్టుకోకూడదు. ఈ సృష్టికి ఆధారంగా, చావు పుట్టుకలతో సంబంధం లేకుండా స్వతంత్ర్యంగా ఏ చైతన్యం అయితే ఉందో ఆ చైతన్యంలో ప్రవేశించటం తప్పించి నాకు ఇంకో గమ్యం లేదు, ఇంకో గమ్యం పెట్టుకొన్నానా మహాఅంధకారంలోనికి, కటికచీకటిలోనికి వెళ్ళిపోతాను. గురువు సహాయం లేకుండా అజ్ఞానమనే మహాఅంధకారంలో నుండి మనం బయటకు రాలేము. దేవుడి మీద భక్తి కలగటం తేలిక, గురువు మీద భక్తి కలగటం చాలా కష్టం. ఎందుచేతనంటే దేవుడు మన కళ్ళకు కనబడడు. గురువు మనలాగే శరీరం ధరించి వచ్చి, మనతో కలిసి తిరుగుతూ ఉంటాడు కాబట్టి వాడిమీద భక్తి కలగటం కష్టం. దేవుడు ఎక్కడో వైకుంఠంలో ఉన్నాడు అంటే తొందరగా భక్తి కలుగుతుంది, మనకు ఎదురుగా కనిపించే గురువు మీద భక్తి కలగటం కష్టం. దైవభక్తికంటే గురుభక్తి కష్టం. భగవంతుడు అంతటా వ్యాపించి ఉన్నాడు, మన హృదయంలో ఉన్నాడు. నీకు నేను అనే తలంపు ఉంది కదా, వాడినే మనస్సు, జీవుడు అంటారు. ఈ జీవుడు ఎక్కడైతే ఉదయించి వస్తున్నాడో అక్కడే దేవుడు ఉన్నాడు. ఈజీవుడిని ఆదేవుడి దగ్గరకు పంపాలంటే గురువు సహాయం లేకుండా సాధ్యం కాదు. జీవుడు ఏ చైతన్యంలో నుండి అయితే వస్తున్నాడో అక్కడకు పంపటానికి నాకు ఏ ఆటంకాలు వస్తున్నాయి, నాకు ఉన్న బలహీనతలు ఏమిటి, నా మనస్సుకు ఎందుకు లోచూపు రావటంలేదు అని ఆలోచించుకొని ఆ ఆటంకాలను తొలగించుకోవటానికి ప్రయత్నం చేయాలి, అదే సాధన. నా మనస్సుకు లోచూపు రాకపోవటానికి కారణం మీకు తెలియకపోయినా, నాకు తెలుస్తుంది కదా. ఆ ఆటంకాలన్నీ పరిశీలించుకొని, ఒకోదానిని నిరాకరించుకొంటూ రావాలి. ఆటంకాలకు స్వాగతం చెప్పకూడదు, వాటిని నిరాకరించు. ఈ అలవాట్లు అన్నీ నిజంకాదు, ఇవన్నీ తెచ్చిపెట్టుకొన్నవే అని, వాటిలో ఉన్న నిస్సారతను గ్రహించి వాటిని వేరుతోసహా తొలగించుకోవటమే సాధన యొక్క గమ్యం.

భగవంతుడు నిరాకారుడు, నిర్గుణుడు. ఆయనకు ఆకారం లేకపోయినా పనిచేస్తాడు, గుణాలు లేకపోయినా ఆయనను తెలుసుకోవటానికి ఎటువంటి దైవీసంపద కావాలో దానితోటి అనుగ్రహిస్తాడు. మీకు శరీరం ఎలా ఉందో దేవుడికి కూడా శరీరం ఉండాలని మీరు అనుకోవద్దు. ఆయన శరీరం లేకుండా పనిచేయగలడు. మీ మనస్సుకు లోచూపును కలుగజేసి, ఆయనలో ఐక్యం చేసుకోవటానికి ఆ శివుడే దేహం ధరించి వస్తే ఆయన మీకు శివుడిగా కనబడడు, జీవుడిగా కనిపిస్తాడు. పరమాత్మ ఏమని చెప్పాడు అంటే నేను భూమి మీద అవతరించకపోతే దేవుడు లేడు అంటున్నారు, అవతరిస్తే అందరూ అవమానం చేస్తున్నారు, ఒక శరీరం ధరించి భూమి మీదకు వస్తే ఈ దేహదారులందరూ ఏమను కొంటున్నారు అంటే వాడికీ దేహం ఉంది, మనకీ దేహం ఉంది. మనలాగే బట్టలేసు

కొంటున్నాడు, తింటున్నాడు అని శరీరలక్షణాలన్నీ అంటగడుతున్నారు. ఎవరో కొద్దిమంది సత్పురుషులు, భక్తులు మాత్రమే గుర్తించగలుగు తున్నారు, అలా గుర్తించేవారు తరిస్తారు. మేము మీకు బోధించటం గౌరవాలకోసమో లేక మాకు జ్ఞానం రావాలని భోదించటమా? మీ దగ్గర మన్ననలు పొందితే మాకు వచ్చేది ఏమిటి? ఇదంతా దుమ్ముతో సమానము. గౌరవాలు, అగౌరవాలు అన్నీ జీవుడికే. వాడు ఇష్టాలు, అయిష్టాల మధ్యన తిరుగుతూ, ఈ లోకానికి ఆలోకానికి ప్రయాణాలు చేస్తూ ఇలా ఎన్ని జన్మలు ఎత్తినప్పటికీ వాడు పునర్జన్మలలో నుండి బయటకురాలేడు.

సత్పురుషులతో సహవాసం చేయాలనే బుద్ధి ప్రతీ మనిషికీ కలుగదు, వాడిలో ఉన్న కర్మదోషం ఆ బుద్ధిని కలుగనివ్వదు. ఈ వలయంలోనుండి, మాయలోనుండి, ఈ అజ్ఞానంలోనుండి గురువు యొక్క దయ లేకుండా బయటపడలేము, అసలు మనకు దారే కనబడదు. ఒకసారి మనం గురువుఅనుగ్రహంలో పడితే ఏదో జన్మలో మోక్షం వచ్చి తీరుతుంది. భగవాన్ దగ్గర మాధవస్వామి అని ఒకడు ఉండేవాడు. భగవాన్‌కు ఏది కావాలన్నా మాధవా, మాధవా అనేవారు. భగవాన్ ఏది చెపితే అది చేసేవాడు, ఆయనను అంటిపెట్టుకొని ఉండేవాడు. దానిని అర్పణ అంటారు, శరణాగతి చేసినవాడే జ్ఞానం పొందటానికి వచ్చే ఆటంకాలను నిరాకరించగలడు కాని శరణాగతిలేనివాడు నిరాకరించలేడు. కొంతకాలానికి ఆ దేహానికి టైము వచ్చేసింది. మాధవ శరీరం విడిచిపెట్టాక గుజరాత్‌లో బరోడాలో మహారాణి ఇంటి దగ్గర తెల్లనెమలి కింద పుట్టాడు. ఎక్కడ అరుణాచలం, ఎక్కడ గుజరాత్, భగవంతుడి యొక్క విలాసం చూడండి. కొంతకాలానికి ఆరాణిగారు భగవాన్ దర్శనం చేసుకోవాలని భగవాన్‌కు ఏమి సమర్పించుకొందాము అని ఆలోచించి ఈ నెమలిని సమర్పించుకొందాము అనుకొని, ఆ తెల్లనెమలిని చిన్న పిల్లగా ఉన్నప్పుడే తీసుకొని వచ్చింది. రాణిగారు రెండురోజులు ఉండి ఆ నెమలిని ఆశ్రమంలో విడిచిపెట్టి వెళ్లిపోయారు. భగవాన్ ఏమన్నారు అంటే ఈ నెమలిని మేము పెంచాలికదా, ఇక్కడ పెంచే అవకాశం తక్కువ, మిగతా నెమళ్ళు ఉన్నాయి, అవి రంగు నెమళ్ళు దీనిని చేరనిస్తాయో, లేదో అన్నారు. మీరు వద్దని చెప్పినా, నేను మీకు సమర్పించాలి అనుకొని వచ్చాను కాబట్టి ఇక్కడ విడిచిపెట్టి వెళ్లిపోతాను అని మహారాణిగారు చెప్పారు. మనుషులతో మాట్లాడినట్లే భగవాన్ జంతువులతోటి కూడా మాట్లాడేవారు. నెమళ్ళకి వేరుశెనగపప్పు, జీడిపప్పు బద్దలు పెట్టేవారు భగవాన్. భగవాన్ దానిని నెమ్మదిగా మచ్చిక చేసుకొని, ఈ గ్రౌండ్ దాటి బయటకు వెళ్లవద్దని చెప్పేవారు, మిగతా నెమళ్ళు కూడా దానిని ప్రేమగానే చూసేవి. ఈ తెల్లనెమలి పుస్తకాల బీరువా దగ్గర కూర్చొని ముక్కుతో వాటిని పొడుస్తూ ఉండేది. వీడు మాధవస్వామి అని భగవాన్‌కు గుర్తుకు వచ్చింది. మాధవస్వామి ఉండగా ఏమండీ భగవాన్ మీరు ఏదో చెపుతున్నారు మాకు రిఫరెన్స్ ఉండాలి కదా అంటే మాధవా బీరువా దగ్గరకు వెళ్లి ఆ పుస్తకం తీసుకొనిరా అనేవారు భగవాన్. భగవాన్‌కు పుస్తకాలు

ఇచ్చేవారము కదా అని జ్ఞాపకం వచ్చి ఆ బీరువాదగ్గర పుస్తకాలను పొడిచేవాడు. అంటే ఆ శరీరంలో తరించే యోగం లేదు మరల నెమలి రూపంలో భగవాన్ దగ్గరకు వచ్చి తరించాడు, అదీ గురువు అనుగ్రహం.

సర్వసాధారణంగా ఈ లోకంలో కృతజ్ఞతాభావం, విశ్వాసం తక్కువగా ఉంటుంది, అది లోకం యొక్క పోకడ. వారికి నామీద విశ్వాసం లేదు, వీరికి నామీద విశ్వాసం లేదు అనే మాటలు భగవాన్ ఎప్పుడూ చెప్పలేదు. సముద్రంలో అనేక కెరటాలు వస్తాయి. సముద్రానికి దాని అలల గురించి ఏమి తెలియదు. నీకు విశ్వాసం లేదు అని చెప్పవలసిన పని ఆయనకు లేదు, విశ్వాసం ఉన్నవాడు బాగుపడతాడు. ఆయనకు ఏల ఈ గోల. వీరు మంచివారు, వారు చెడ్డవారు ఇవి అన్నీ మనస్సులో ఉన్నాయి. ఆత్మకు మంచిలేదు, చెడ్డాలేదు, ఏదీ లేదు, అది ఆయనై ఉన్నాడు. ఇంక ఆయనకు ఈ గోల ఏముంటుంది. ఒక కవి మాధవస్వామి మీద పద్యాలు వ్రాసుకొని వచ్చి భగవాన్ దగ్గర చదువబోతున్నాడు. ఇక్కడ దొరికారు భగవాన్. నువ్వు చదువుతున్నావు, నువ్వు ఎవరి గురించి వ్రాసుకొని వచ్చావో వాడు వినాలి కదా. అప్పటివరకు వాడు మాధవస్వామి అని భగవాన్ ఎక్కడా తేలలేదు, ఆయనకు లోపల తెలుసు. నాయకుడు ఇక్కడలేడు, నువ్వు చదివేస్తానంటే ఎలాగ? ఇదంతా ఎవరికి వినిపిస్తావు అని ఆ నెమలిని ఏదో పేరు పెట్టి గట్టిగా పిలిచారు, భగవాన్ కేకలు వినిపించి అక్కడకు వచ్చింది. ఇప్పుడు నాయకుడు వచ్చాడు, చదువు అన్నారు. వీణతో వాడు పది పద్యాలు చదివాడు. అవన్నీ విన్నాడు. ఆపు చేసి వీణను ప్రక్కన పెడితే ఆ వీణను పొడుస్తున్నాడు నెమలిరూపంలో ఉన్న మాధవస్వామి. వాడు పట్టించుకోవటం లేదు. అప్పుడు భగవాన్ అన్నారు నువ్వు చూసుకోవటంలేదు, నీ వీణను పొడుస్తున్నాడు అంటే ఇంకోసారి పాడమని అర్థం అని చెప్పారు. అప్పుడు మరల పాడితే విని ఆనందించి కన్నీళ్ళు కార్చాడు మాధవస్వామి. గోలక్ష్మిని ఆయన చేతుల మీదుగా ఎలా పంపారో, చివరకు ఈ నెమలి రూపంలో ఉన్నవాడిని కూడా ఆయన చేతులతో పంపారు. లక్ష్మి వెళ్ళిపోయిన తరువాత, నెమలి రూపంలో ఉన్న మాధవస్వామి వెళ్ళిపోయిన తరువాత భగవాన్ ఒకమాట అన్నారు. లక్ష్మి వెళ్ళిపోయింది, మాధవుడు కూడా వెళ్ళిపోయాడు, ఇంక నేను ఉన్నాను అంటే నాకు ఇంకా చావు రాలేదు అని, అది వాళ్ళమీద ఉన్న ఆప్యాయత. మనం క్లోజ్‌గా పరిశీలిస్తే దొరుకుతారు గాని పరాగ్గా ఉంటే మనకు అర్థం కాదు.

జ్ఞాని ఎవడినీ ప్రేమించాలని ప్రేమించడు, ప్రేమించకుండా ఉండలేడు కాబట్టి ప్రేమిస్తాడు. ధర్మాన్ని ఆచరించాలని ఆచరించడు, ఆచరించకుండా ఉండలేడు కాబట్టి ఆచరిస్తాడు. వర్షంకురిసే టప్పుడు ఇవి మంచివారి పొలాలు, ఇవి చెడ్డవారి పొలాలు అని ఏమీ ఉండదు. అందరి పొలాల్లోను కురుస్తుంది, అందరి ఇళ్ళమీద కురుస్తుంది. అలాగే జ్ఞాని సమక్షంలోనికి ఎవరు వెళ్ళినా ఆయన మనలను చూసేటప్పుడు మనలో ఉన్న గుణాలను

చూడడు, మనలో అంతర్యామిగా ఉన్న పరమాత్మనే చూస్తూ ఉంటాడు. అమృతాన్ని వర్షింపచేస్తాడు. జుర్రుకొన్నవారు ధన్యులు. మనకు దైవానుగ్రహం వచ్చినప్పుడు దాని వైభవం ముందు మనకు ఉన్న చదువులు, అధికారాలు, పైసాలు అన్నీ గడ్డిపరకతో సమానము, అదీ దానియొక్క వైభవం. ఎప్పడో సడన్‌గా దైవానుగ్రహం వచ్చి మిమ్మల్ని స్వాధీనం చేసుకొన్నప్పడు మీ మనస్సుమీద, మీ శరీరం మీద, మీ గుణాలమీద ఉన్న అభిమానం పోయి చైతన్యంలో ఐక్యమైపోతారు, అది మీ కడసారి జన్మ. ఆ చైతన్యం ఎప్పడు మిమ్మల్ని స్వాధీనం చేసుకొంటుందో, ఆ శుభగడియలు ఎప్పడు వస్తాయో, ఆ ముహూర్తం ఆయనే పెట్టుకొంటాడు కాని మనం చేసేదికాదు. నాకు అది ఇయ్యి, నాకు ఇది ఇయ్యి, నాకు మోక్షం ఇయ్యి అని అడిగితే అది శరణాగతా, అది సమర్పణ భావమా, అది భక్తా. చైతన్యం ఎప్పడైతే మిమ్మల్ని స్వాధీనం చేసుకొందో అప్పడు ఈ దేహం మరణించినా, ఈ దేహం భూమి మీద తిరుగాడుతున్నా, మీకు లోకం కనిపిస్తున్నా, లోకం కనిపించకపోయినా చైతన్యం తాలుక శాంతి, కాంతి, ఆనందం మిమ్మల్ని క్షణం కూడా విడిచిపెట్టవు, ద్వైతులు ఏమంటారు అంటే మనం బ్రహ్మానందంలో కలిసిపోతే ఎలాగ, ఆనందం అనుభవించటానికి నేను ఉండాలి కదా, ఈ నేను కూడా భగవాన్ తీసేయమంటున్నారు, ఈ నేనుపోతే ఎలాగ? అంటారు. భగవాన్ ఏమంటున్నారు అంటే నేను చెప్పే ఆనందం ఎటువంటిది అంటే అది అలౌకికమైనది, అభౌతికమైనది. నేను ఆనందం అనుభవించాలి అంటే అక్కడ నేను ఉంది, ఆనందం ఉంది. ఈ ఆనందం, ఈ నేను రెండూ కలిసిపోయి ఎక్కడైతే ఐక్యమైపోతాయో అట్టి బ్రహ్మానందంలోనికి మిమ్ములను తీసుకొనిపోతాను, అప్పడు ఆనందంలో, శాంతిలో ఊగిసలాడటమే, ఈ తలంపులతో పనిలేదు. నువ్వు ఆనందిస్తూ ఉంటావు, నేను ఆనందిస్తున్నాను అనే ఆ నేను కూడా ఆనందంలో కలిసిపోయి ఊగిసలాడతావు.

నువ్వు ఏదైనా ఒక పని చేస్తే, ఒక మాట మాట్లాడితే, మనస్సులో ఏదైనా ఒక ఆలోచన వస్తూ ఉంటే అది లోకానికి ఉపయోగపడాలి లేకపోతే నువ్వు మోక్షం పొందటానికైనా ఉపయోగపడాలి. లోకక్షేమాన్ని, మోక్షంపొందటాన్ని వీటిని రెండింటిని సమన్వయం చేసుకొని పనిచెయ్యి. కేవలం వెల్‌ఫేర్, వెలఫేర్ అంటూ కూర్చోవద్దు, నువ్వు ఏది పొందాలో అది మర్చిపోవద్దు. మీ ఇంటికి ఎవరైనా అప్పకోసం వచ్చారు అనుకోండి మీరు అంతటివారు, ఇంతటివారు అని ముందు పొగుడుతాడు, తరువాత పదివేలు అవసరమండి, నోటురాసి ఇస్తాను అంటాడు. ఆ పదివేల కోసం వాడిని పొగిడి ఏనుగు మీద కూర్చోబెడతాడు. నన్ను ఎంత పొగొడుతున్నాడో, నన్ను ఎంత ప్రేమిస్తూ మాట్లాడుతున్నాడో అని వీడు అనుకొంటాడు. వాడి స్వార్థం కోసం ఇలా మాట్లాడుతున్నాడు, వాడి స్వార్థాన్ని ప్రేమించుకొంటున్నాడు అని తెలియని అమాయక జీవితాలు గడుపుతున్నాము. నువ్వు ఏదిగా ఉన్నావో దానిని పొందటానికి ప్రయత్నం చేస్తున్నావు కాని నువ్వు కానిదానిని విడిచిపెట్టటం నీకు ఇష్టం

లేదు. నువ్వు మనస్సువు కాదు, నువ్వు దేహం కాదు, నువ్వు గుణాలు కాదు కాని నువ్వు దేహం మీద, మనస్సుమీద భ్రాంతిని విడిచిపెట్టవు. అవి విడిచిపెట్టవు నీకు సత్యం కావాలి, జ్ఞానం కావాలి అంటే ఎలా వస్తుంది. మీకు పాడైపోయిన ఇల్లు ఉంది అనుకోండి, పాడైపోయిన ఇల్లు విప్పము, అక్కడ డాబా కట్టుకోవాలని ఉంది అనే మాట ఎటువంటిదో నువ్వు కానిదానిని విడిచిపెట్టకుండా నువ్వు ఏదిగా ఉన్నావో దానిని తెలుసుకోవటానికి ప్రయత్నం చేయటం కూడా అటువంటిదే. ఇవన్నీ ఎండమావులలో ఉన్న నీళ్ళు వంటివి.

నువ్వు వంద సంవత్సరాలు బతికినా హృదయాన్ని ఖాళీచెయ్యటం మానేసి, నేను అంతటివాడిని, నేను ఇంతటివాడిని అని బరువులు మోస్తూ ఏదైతే ఖాళీచెయ్యాలో దానిని ఖాళీచెయ్యటం మానేసి రోడ్డు మీద దుమ్ము అంతా తెచ్చుకొని హృదయంలో నింపుకొని నాకు జ్ఞానం కావాలి అని అడుగుతూ ఉంటే భగవంతుడు అమాయకుడా నీకు జ్ఞానం ఇవ్వటానికి. నువ్వు ఎన్ని సంవత్సరాలు బతికినా ఈ ప్రకృతిగొడవలతో హృదయాన్ని నింపుకొంటున్నావు. ఎక్కడైతే భగవంతుడు ఉన్నాడో అక్కడ కప్పేస్తున్నావు. భూమిలో పదార్థం ఉంది అనుకో అది మనకు దొరకాలి అంటే అక్కడ భూమిని తవ్వితే ఆ పదార్థం దొరుకుతుంది. అలాగే నీ హృదయంలో ఉన్న దుమ్మును తొలగించుకొని హృదయాన్ని ఖాళీచేసుకొంటే అక్కడ ఉన్న బ్రహ్మం నీకు వ్యక్తమవుతుంది. నీ హృదయంలో ఉన్న దుమ్మును తొలగించుకోవు, నీకు జ్ఞానం కావాలా? నీవు ఏదైతే కాదో దానిని విడిచిపెట్టాలి. నీవు ఏదైతే కాదో దానిని విడిచిపెట్టటం అంత తేలిక కాదు ఎందుచేతనంటే అదే నువ్వు అనుకొంటున్నావు కాబట్టి. గురువు అనుగ్రహం లేకుండా నీవు దానిని విడిచిపెట్టలేవు. భగవాన్ అంటున్నారు ఒక గది ఖాళీ చెయ్యాలి అంటే దానిలో ఉన్న వస్తువులు అన్నీ బయటకు తియ్యకుండా ఆ గది ఖాళీ ఎలా అవుతుంది. అలాగే నీ హృదయంలో ఉన్న వాసనలను బయటకు లాగి కాల్చి బూడిద చేయకుండా నీ హృదయం ఎలా ఖాళీ అవుతుంది. నీ హృదయంలో ఉన్న ప్రకృతి గొడవలను బయటకు గెంటితే కదా అది ఖాళీ అయ్యేది, అప్పుడు కదా నీకు ఈశ్వరసాక్షాత్కారం. గదిని ఖాళీ చెయ్యటం అంటే ఖాళీని ఎక్కడ నుండో తీసుకొనిరావటం కాదు. అందులో ఉన్న వస్తువులు బయట పాడేస్తే అది ఖాళీ అవుతుంది. అలాగే నీ హృదయంలో ఉన్న చైతన్యాన్ని ఎక్కడ నుండో తీసుకొని రానక్కరలేదు, దానిని మూసేసిన గొడవలను బైటపడవేయటమే.

భగవాన్ అంటారు నువ్వు ఇల్లు విడిచిపెడితే జ్ఞానంరాదు, ఇంటిమీద ఉన్న మమకారం విడిచిపెడితే జ్ఞానం వస్తుంది. ఒకోసారి మీరు ఎదురుగా ఉన్నా గురువు మాట్లాడడు. మీలో ఉన్న వాసనను తీసెయ్యటానికి, మీ హృదయంలో మీరు ఐక్యం అవ్వటం కోసం మీతో మాట్లాడకుండా, మీతో పరిచయం లేనట్లు నటిస్తున్నాడు అనుకోండి. గురువు గారికి ఈ రోజు కోపంగా ఉంది అని మీరు అనుకొంటారు. గురువు ఆత్మ అయి ఉన్నాడు, అక్కడ ద్వితీయం లేదు, కోరిక లేదు, కోపం లేదు, వేరుబుద్ధి లేదు, ఇవన్నీ మనస్సుకు సంబంధించిన

గొడవలు. గురువు మీతో మాట్లాడకపోతే ఇదేమిటి ఈ రోజు గురువుగారికి కోపం వచ్చింది ఏమిటి, గర్వం వచ్చింది ఏమిటి అని ఇలా ఏదో ఒకటి అనుకొంటారు ఎందుచేతనంటే మీరు ఏదో ఒకటి అనుకోకుండా ఉండలేరు. మీరు అనుకొనేది మీకు ఆత్మజ్ఞానసముపార్జనకు అడ్డు వస్తోంది అని తెలియజేయటానికి గురువు చేసే యాక్షన్ అది. అది పర్సనల్ యాక్షన్ కాదు. ఈ ప్రకృతిలో నుండి, జననమరణచక్రంలో నుండి నిన్ను విడుదలచేసి మహాచైతన్యంలో నిన్ను ఐక్యంచేయటానికే కోపం నటిస్తున్నాడని తెలిసినవారు ధన్యులు. నీకోసమే ఆయన కోపం నటిస్తున్నాడు గాని అది పర్సనల్ యాక్షన్ కాదు, ఇది మీరు గుర్తు పెట్టుకోండి. అది పర్సనల్ రియాక్షన్ అనుకోవటం వలన గురువు మీద మనకు భక్తి కలగటం చాలా కష్టం. నువ్వు ఏదైతే అవునో దాని తాలుక ఎరుక వచ్చేవరకు కానిదానిని అదే అనుకొంటావు. దేహమే అది, మనస్సే అది అనుకొంటూ ఉంటావు. దేనికైతే పుట్టుక లేదో, దేనికైతే చావులేదో అది నీవైనప్పటికీ అది నీకు తెలియకపోవటం వలన అది చనిపోతోంది, అది పుడుతోంది అనుకొంటున్నావు. రాత్రిళ్ళు మనకు స్వప్నాలు వస్తాయి. మెలుకువ వచ్చాక ఇది అంతా అబద్ధం, నా మంచం మీద నేను ఉన్నాను అని ఎలా అనుకొంటాడో అలాగే మహాచైతన్యంలో మేల్కొన్నప్పడు ఈ జన్మలు, చావు పుట్టుకలు, నువ్వుపడ్డ బాధలు, లాభ నష్టాలు, భోగాలు, రోగాలు ఇవన్నీ స్వప్నమాత్రమే అని నీకు తెలుస్తుంది. నేను ఎప్పడూ ఆత్మగానే ఉన్నాను, దానిని మర్చిపోవటం వలన ఇన్ని గొడవలు పడ్డాను అనే అనుభవం మీకు వస్తుంది, అది చివరి జన్మ.

చైతన్యానుభవం నువ్వు ఏదో అనుకోవటం వలన రాదు. నీ ప్రవర్తనను చూసి, నీ సద్బుద్ధిని చూసి, నీ హృదయాన్ని చూసి ఆ మహాచైతన్యానికి ఎప్పడైతే దయ కలిగిందో అప్పడు సడన్‌గా వచ్చి నిన్ను ఆక్రమించుకొంటుంది, ఆక్రమించుకొన్న వెంటనే శవబుద్ధి నశిస్తుంది, మనం కానిదంతా కొట్టుకొనిపోతుంది, మనం ఏదిగా ఉన్నామో అది మనకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. నిన్ను ఆక్రమించుకోవటానికి అది ముహూర్తం పెట్టుకొంటుంది, దానికి మనం ప్రిపేర్ అవ్వటమే మనం చేసే సాధన. విషయ చింతనలో నుండి, విషయ సుఖాలలోనుండి, భోగాలలో నుండి వచ్చే ప్లెజర్‌కంటే వివేకంలో నుండి, డిస్‌క్రిమినేషన్‌లో నుండి వచ్చే శాంతి ఎక్కువకాలం నిలబడుతుంది. కుమారుడు అంటే చెడ్డను తొలగించేవాడు, మహాచైతన్యంలో ప్రవేశించటానికి ఏ కారణాలు అయితే మీకు అడ్డువస్తున్నాయో వాటిని ముక్కలు ముక్కలుగా నరికేవాడే కుమారుడు. గురుశిష్య సంబంధం లేకుండా మిమ్మల్ని జ్ఞానంతో, శాంతితో నింపేవాడే కుమారస్వామి. భగవాన్ పుల్లమ్మగారి వంక చూస్తున్నారు అనుకోండి, ఏమిటండీ అలా చూస్తున్నారు అంటే నన్ను నేనే చూసుకొంటున్నాను అనేవారు. ఆయన ఏమిటి ఆత్మ, అక్కడ కనిపించేది కూడా ఆత్మే. తాను ఏదిగా ఉన్నాడో చూసేదానిలో కూడా అదే ఉంది. ఇతరులను చూస్తున్నాడు అని

మీకు అనిపించవచ్చుగాని ఆయనను ఆయనే చూసుకొంటున్నాడు. వాడే స్కంధుడు, వాడే కుమారస్వామి, వాడే రమణుడు. భగవాన్‌లో విశేషం ఏమిటి అంటే ఈ ప్రపంచంలో ఏ సంఘటన వలన ఆయనకు రియాక్షన్ రాలేదు. జనం లేకపోయినా, కీర్తి లేకపోయినా, ధనం లేకపోయినా గురువు గురువే.

## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 21-12-07, అత్తిలి)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

సనత్‌కుమారుడు నారదుడికి ఆత్మవిద్య బోధించాడు. నేను 64 విద్యలలో పండితుడను, ఇన్ని విద్యలలో పండితుడనైనా నాకు దుఃఖం ఆగటంలేదు, అశాంతి వచ్చేస్తోంది అని నారదుడు సనత్‌కుమారుడిని అడిగాడు. నువ్వు అన్ని విద్యలు నేర్చుకున్నావుగాని ఏవిద్య నేర్చుకొంటే దుఃఖం మూలంతో సహా నశిస్తుందో అది నేర్చుకోలేదు, అది నీకు తెలియటం లేదు, మిగతావిద్యలు నేర్చుకొన్నా ప్రయోజనం లేదు అని అప్పుడు ఆత్మవిద్యను సనత్ కుమారుడు నారదుడికి బోధించాడు. ఈ విద్యను శ్రద్ధగావిని, గుండెకు పట్టించుకో అప్పుడు దుఃఖ స్పర్శలేనిస్థితిని పొందుతావు అని చెప్పాడు. దీనినే బ్రహ్మవిద్య అంటారు. నువ్వు బ్రహ్మంను విడిచిపెట్టి ఎక్కడికి వెళ్ళినా అశాంతే అని చెప్పాడు. ఆ సనత్‌కుమారుడే సుబ్రహ్మణ్యుడుగా వచ్చాడు. తారకాసురుడు అనే రాక్షసుడు ఉండేవాడు, వాడిని ఎవరూ చంపలేకపోతున్నారు, శివుడికి ఒక కుమారుడు వస్తే వాడు తారకాసురుడిని సంహరించగలడు కాని ఎవరివలన సాధ్యం కాదు అని చెప్పారు. తారకాసుర సంహారం కోసం నీ ప్రతిరూపం కావాలి అని దేవతలు వెళ్ళి శివుడిని ప్రార్థించారు. శివుడు సనత్‌కుమారుడి దగ్గరకు వెళ్ళి నీకు ఏదైనా కావాలంటే కోరుకోమని అంటూ అతనిని భూమి మీదకు తీసుకొని రావటానికి ఏవో ఆకర్షణలు చూపించాడు. నువ్వు కళ్యాణస్వరూపుడవు, కోరికలు నెరవేర్చగల సమర్థుడవు కాని నాకు కోరికలతో పనిలేదు అంటాడు. అంటే లోకమే లేనివాడికి అసలు కోరిక ఏమిటి? బ్రహ్మజ్ఞానికి ఈ సృష్టి అంతా గడ్డిపరకతో సమానము. మీరు నన్ను కోరుకోమంటున్నారు నేనే మీకు ఇస్తాను కోరుకోండి అంటాడు. వెంటనే శివుడు నా కుమారుడిగా జన్మించు అంటాడు. తీరామాట అన్నాను మీ కుమారుడిగా వస్తాను కాని తల్లి కడుపులో నుండి రాను అన్నాడు. అప్పుడు శివుడి మూడవనేత్రంలో నుండి వస్తాడు, వాడే సుబ్రహ్మణ్యుడు. బ్రహ్మం గురించి వెలితి లేకుండా ఉన్నది ఉన్నట్లుగా సమగ్రంగా తెలిసినవాడు సుబ్రహ్మణ్యుడు, ఆయన జ్ఞానగురువు.

శివుడు పార్వతిల దగ్గర వినాయకుడు, సుబ్రహ్మణ్యుడు కూర్చొని ఉండగా నారదుడు ఒక పండు పట్టుకొని వెళ్ళాడు. నారదుడు ఏదైనా పేచీపెడితే మంచి జరగటానికి పెడతాడు గాని చెడ్డ జరగటానికి పెట్టడు. ఆ పండు ఇద్దరూ కావాలన్నారు. అప్పుడు శివుడు ఏమి చేసాడు అంటే ఈ భూమి యొక్క ప్రదక్షిణ ఎవడైతే ముందుగా చేసివస్తాడో వాడికి పండు

ఇస్తాను అని చెప్పాడు. సుబ్రహ్మణ్యుడు మయూరి వాహనం మీద స్పీడుగా వెళ్ళిపోయాడు. ఎలుకను వాహనంగా చేసుకొని వినాయకుడు ఎంత దూరం వెళతాడు. భూప్రదక్షిణ చేయమన్నారు కదా తల్లితండ్రులు భూమితో సమానంకదా, లోకాలన్నీ శివుడి గర్భంలో ఉన్నాయి కదా అని ఎలుక మీద కూర్చొని తల్లితండ్రుల చుట్టూ తిరిగేసాడు. పండు వినాయకుడికి ఇచ్చేసారు, ఆయన తింటూ కూర్చొన్నాడు. కుమారస్వామి అంతా కష్టపడి తిరిగివచ్చాడు. తల్లితండ్రుల చుట్టూ తిరిగాడు ఆయనకు పండు ఇచ్చేసాము అని చెపితే మీరు చెప్పేమాటలు న్యాయంగా లేవు అని కుమారస్వామికి కోపం వచ్చి భూలోకంలోనికి వెళ్ళిపోతాను అన్నాడు. ఆ పండు తింటే పోతుంది, అది నీకు ఎందుకు? నీవు జ్ఞానఫలానివి అని చెప్పినా వినకుండా ఫళణి వచ్చేసాడు. సనత్‌కుమారుడు సుబ్రహ్మణ్యుడుగా వచ్చాడని, సుబ్రహ్మణ్యుడే రమణమహర్షిగా వచ్చాడని ఒక సాంప్రదాయం. తిరుచందూరులో సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని పూర్ణఅవతారంగా చూపించారు. తిరుచందూరులోనే ఆయన తారకాసురుడిని సంహరించాడు. ఇప్పటికి కూడ తిరుచందూర్ దగ్గర సముద్రం చూడండి. సముద్రంలో మిగతా నీరు అంతా ఒకరకంగా ఉంటుంది, తిరుచందూర్‌లో సముద్రం నీరు కలర్ ఒక రకంగా ఉంటుంది. ఇంద్రుడు తన కుమార్తె దేవయానిని సుబ్రహ్మణ్యస్వామికి ఇచ్చి వివాహం చేసాడు. వల్లీ సామాన్య కుటుంబంలో నుండి వచ్చి సుబ్రహ్మణ్యస్వామిని పెళ్ళి చేసుకొంది. మీరు ఏదైనా ఒక పని చేయాలంటే సంకల్పం రావాలి, ఆ సంకల్పమే వల్లీదేవి, ఆ సంకల్పం నెరవేరాలంటే క్రియాశక్తి ఉండాలి, క్రియాశక్తే దేవయాని. అంటే సుబ్రహ్మణ్య స్వామి దగ్గర రెండు శక్తులు ఉన్నాయి. 1. సంకల్పశక్తి, 2. క్రియాశక్తి. ఈ రెండు శక్తులను సుబ్రహ్మణ్యస్వామికి భార్యలుగా చూపించారు. సుబ్రహ్మణ్యుడు ఈ భూమి మీదకు ఏపని మీద అయితే వచ్చాడో ఆ పని అంతా పూర్తిచేసి తిరుత్తణి వచ్చి అక్కడ విశ్రాంతి తీసుకొన్నాడు, అక్కడ శాంతి సుబ్రహ్మణ్యుడు. ఆయన జ్ఞాన గురువు. శివుడికి ఓంకారం గురించి వివరించి శివుడికి గురువు అయ్యాడు.

గురువు అన్నా, ఈశ్వరుడు అన్నా, ఆత్మ అన్నా ఒక్కటే. గురువు యొక్క వైభవం ఎక్కడ ఉంది అంటే మనలో ఉన్న బలహీనతలను, మన పొరపాట్లను నోటితో చెప్పడు. మీకు ఆత్మానుభవానికి ఏ బలహీనతలు, అలవాట్లు అడ్డువస్తున్నాయో వాటిని అంతర్యామిగా ఉన్న గురువు చూసుకొంటూ ఉంటాడు. ఆ బలహీనతలు నీకు తెలియవు. వాటిని నీ సహస్రారానికి తీసుకొనివచ్చి, ఆ బలహీనత ఉందని నీకు తెలియజేసి, ఆ బలహీనత నుండి బయట పడే శక్తిని కూడా ఆయనే కలుగజేసి, మార్గం చూపిస్తాడు, వాడు గురువు. ఈ మనస్సు పెట్టే క్షోభలో నుండి బయటపడాలి, ఈ సంసారం అనే పెద్ద అడవిలో నుండి బయటకు రావాలనే సంకల్పాన్ని ఇచ్చేది వల్లీదేవి, ఆ సంకల్పానికి శక్తి ఇచ్చి నెరవేరేలా చేసేది దేవయాని. గురువు బయటకు ఏమీ తెలియనట్లు ఉంటాడు, పని అంతా లోపల చేసుకొంటూపోతాడు. మీరు ఎంత ఉపకారం చేసారో అంటే నాకు ఏమీ తెలియదు అంటాడు. ఎందుచేతనంటే

ఆయనకు గుర్తింపులు అక్కరలేదు. నీకు ఉన్న అలవాట్లనుబట్టి, కోరికలను బట్టి బయట ఏదో ఉందని అనుకొంటున్నావు. బయట ఏమీలేదు. ఈ లోపల, బయట అనే గొడవ అంతా నీ అజ్ఞానానికి గుర్తు. ఇది అంతా దొంగనేను చేసే చేష్టలు. అసలు వస్తువుకు లోపల లేదు, బయటలేదు. జ్ఞాని మీ హృదయం యొక్క లోయలలోనికి వెళ్ళి చూస్తాడు. జ్ఞానం తాలుక ఎరుక మీకు ఎందుకు రావటంలేదో చూసి, అక్కడ ఉన్న డస్టును కెలికి నీ బుద్ధికి చూపించి బయటకు లాగుతాడు, వాడు నిజమైనగురువు. ఈశ్వరానుగ్రహం పొందటానికి మనం అందరం ప్రయత్నం చేయాలి. మనం ఉదయం 5 గంటలకు లేచి, రాత్రి 9 గంటలకు పడుకొంటాము అనుకోండి. ఈ రోజున మన డ్యూటీ సరిగ్గా చేసామా? బయట ఆకర్షణలకు ఏమైనా గురి అయ్యామా? ఇంద్రియాలు ఏమైనా దొంగచూపులు చూస్తున్నాయా? మనస్సుకు ఏమైనా చెడుతలంపులు వచ్చాయా? ఇతరులకోసం ఏమైనా చేసామా లేక మన పొట్టకోసమే చేసుకొన్నామా? ఎవరికైనా కష్టాలు వస్తే వారి కన్నీళ్ళు ఏమైనా తుడిచామా? సమాజానికి ఏమైనా ఉపయోగపడ్డామా? భగవంతుడు సంతోషించే పనులు ఏమైనా చేసామా? ఈ రోజు మనం సాధన ఏమి చేసాము అని రాత్రి పడుకొనేటప్పుడు ఎక్కౌంటు రాసేసుకోండి.

కొంతమందికి వందసంవత్సరాలు వచ్చినా వారికి ఉన్న అలవాట్లలో నుండి బయటపడటానికి, బుద్ధిలో ఉన్న వంకరలు తొలగించుకోవటానికి అసలు ప్రయత్నం చేయరు, ఇలా హృదయంలో వికాసం లేనివారిని కనుబొమ్మల మీద వెంట్రుకలవంటివారు అంటారు. నీకు గుడ్‌కంపెనీ దొరకకపోతే బేడ్‌కంపెనీలోనికి వెళ్ళకు. గుడ్‌కంపెనీ దొరకకపోతే అడవిలో ఏనుగులాగ ఒంటరిగా బతుకు అన్నాడు బుద్ధుడు. మనకు ఉన్నది మిథ్యాజ్ఞానం, సనత్‌కుమారుడు చెప్పినది ఆత్మజ్ఞానం. ఆత్మజ్ఞానం లేకుండా శాంతి లేదు, మోక్షం లేదు, జ్ఞానం సంపాదించాలనే కాంక్ష మీ లోపల నుండి రావాలి. గురువు అంతా చూస్తూ ఉంటాడు. జ్ఞానం గురించి చెపుతాడు, చెపుతాడు అయినా మీరు వినకపోతే గురువు ఏమి చేస్తాడు అంటే దూడలను పడగొట్టి గొట్టముతో మందు ఎలా పోస్తారో అలాగ మీకు కూడా గొట్టంపెట్టి జ్ఞానాన్ని పోస్తాడు. మీరు ఏమి అనుకొంటున్నారో ఆయనకు అక్కరలేదు. మిమ్ములను ఎక్కడకు తీసుకొని వెళ్ళాలనుకొంటున్నాడో అక్కడకు తీసుకొని వెళ్ళేవరకు వేటగాడు జంతువును ఎలా వెంటాడుతాడో అలా ఈ జన్మలోనే కాదు రాబోయే జన్మలో కూడా మీ గురువు మిమ్మల్ని వెంటాడుతూ ఉంటాడు. వశిష్ఠుడు రాముడికి భోదిస్తూ పురుష ప్రయత్నం అవసరమే, సత్యజ్ఞానమునకు నువ్వు చేసే ప్రయత్నం హృదయపూర్వకంగా చెయ్యి, నిండు మనస్సుతో చెయ్యి కాని ఈశ్వరానుగ్రహంతో పోల్చుకొన్నప్పుడు నీ ప్రయత్నం ఏపాటిది. ఈశ్వరుడికి మనకు దూరం పది అడుగులు ఉంటే మనం కష్టపడి ఒక అడుగు వేస్తే తొమ్మిది అడుగులు వేసి మన ఎదురుగా వచ్చి ఆయన ఒడిలోనికి తీసుకొంటాడు,

ఆయన ఈశ్వరుడు. అలాగని నీ ప్రయత్నం మానకు. వచ్చేది అక్కడ నుండే రావాలి. నువ్వు చెయ్యకలిగింది ఏదీ మానవద్దు అలాగని నీ ప్రయత్నం వలననే దైవసాక్షాత్కారం అవుతుందని అనుకోవద్దు. ఆయన దయ రావాలి. దేవుని అనుగ్రహం అనే వరద వచ్చినప్పడు ఆ మహాప్రవాహంలో నీ ప్రయత్నంతో సంబంధం లేకుండా నీ బలహీనతలు, కోరికలు, అలవాట్లు, వాసనలు అన్నీ కొట్టుకొనిపోతాయి, అనుగ్రహప్రవాహము అట్టిది.

మీ ఇంట్లో పిచ్చివాళ్ళు ఉంటే తాళ్ళతోకట్టివేస్తున్నారు. వారు రోడ్డు మీద తిరగకుండా ఉండటం కోసం, మందులు ఇవ్వటం కోసం, వారి మనస్సు బాగుపడటం కోసం అలా కట్టేస్తున్నారు. అలాగే మనలను బాగుచేయటం కోసం ఈశ్వరుడు ఒకోసారి కష్టాలు కలిగిస్తాడు. ఎటుచూసినా ముళ్ళకంపలే దారి కనబడటం లేదు ఏమిటి అని మనకు అనిపిస్తుంది కాని ఆయన కావాలనే అటువంటి పరిస్థితులు పెట్టి మన బుర్రలో ఉన్న విషం కక్కిస్తాడు, వాడు గురువు. దేవుడికి మన మీద దయలేదు అని మనం అనుకొంటాము. దేవుడి దయ అనేది ఉందని కూడా మీకు తెలియటం లేదు, ఉందని గుర్తింపు రావటంకోసం మీచేత విషం కక్కిస్తాడు. కూర చాలా బాగుంది అనుకోండి, తినటానికి మనకు కొంచమైనా ఆకలి ఉండాలి కదా. తింటేకదా రుచి మనకు తెలిసేది. అలాగే దేవుడు దయాస్వరూపుడైనా దైవానుభవం పొందాలి అనే ఆకలి, కాంక్ష కొంచమైనా మనకు ఉండాలి కదా. ఆ జిజ్ఞాస కొంచమైనా మనకు ఉంటే అదే మనకు పెట్టుబడి అవుతుంది. భగవంతుడు ఒక వేళ మనలను తిరస్కరించినా ఆయన పాదాలను విడిచిపెట్టకూడదు. భగవాన్ దగ్గరకు ఒక భక్తుడు వచ్చాడు, ఆయన చాలా ప్రేమగా, ఇష్టంతో వచ్చాడు. కాని భగవాన్ ఆయనతో మాట్లాడటం లేదు. ఆ భక్తుడు అన్నాడు నువ్వు నాతో మాట్లాడినా మాట్లాడకపోయినా, నామీద ఇష్టం ఉన్నా లేకపోయినా, ప్రేమ ఉన్నా లేకపోయినా వంద జన్మల తరువాత అయినా కూడా నీ చేతులతోటే నాకు మోక్షం రావాలి అన్నాడు, వాడు భక్తుడు. ఎందుచేతనంటే నా తాళం చెవి నీ దగ్గర ఉంది, ఎప్పటికైనా నీ చేతిద్వారానే తరించాలి.

ఒకవేళ భగవంతుడు మన కోరికలు నెరవేర్చటం లేదు అనుకోండి ఆ కోరికలు నెరవేర్చక పోవటానికి ఒక కారణం ఉంటుంది, కారణం ఆయనకు తెలుసు గాని మనకు తెలియదు. కోరికలు నెరవేర్చే వారికి ఎందుకు నెరవేరుస్తున్నాడు, కోరికలు నెరవేరకుండా కొంతమందికి ఎందుకు ఆపుచేస్తున్నాడు అది మనకు తెలియదు, ఆయనకు తెలుసు. ఆయన మనకంటే తెలివైనవాడు. మనకు ఏది మంచిదో మనకంటే దేవుడికి ఎక్కువ తెలుసు అందుచేత మనం శరణాగతి చెయ్యటం మంచిది. శరణాగతి చేయటం వలన శాంతి కలుగుతుంది, దొంగనేను నెమ్మదిగా పల్చబడి మనకు తెలియకుండా రాలిపోతుంది. మనం అమెరికా వెళ్ళినా, ఇంగ్లండు వెళ్ళినా ఏదేశం వెళ్ళినా మన నిదానంలో మనం ఉండాలి. మన సభ్యత, సంస్కృతి విడిచిపెట్టకూడదు. డబ్బు సంపాదించుకోవటానికి ఆ దేశాలు వెళ్ళినా

మన మనస్సు పాడవ్వకుండా చూసుకోవాలి. డబ్బు వలన మనిషి సుఖపడడు. సుఖం అనేది డబ్బులోకాని, చదువులోగాని, అధికారంలోగాని లోకంలో బయట ఎక్కడా సుఖం లేదు. సుఖం, శాంతి మన హృదయంలోనే ఉంది అది మర్చిపోవద్దు.

## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 25-12-07, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు రమణజయంతి. ఆత్మజ్ఞానం ఒక రూపం ధరించిన రోజు. భగవాన్ జ్ఞాన గురువు, జ్ఞాన యోగి. సుఖం కోసం, శాంతి కోసం లోకంలో వెతుకుచున్న మానవజాతిని అంతర్ముఖం చేసి, మనలో అంతర్యామిగా ఉన్న ఈశ్వర సాక్షాత్కారం చేయించటానికి వచ్చిన అవతారం. అందరికీ సుఖం కావాలి, శాంతి కావాలి. సుఖం బయట ఉందని అనుకొంటున్నాము, సుఖం బయట ఎక్కడా లేదు, సుఖం మన స్వరూపంలోనే ఉంది. మనకు తెలియకుండా మన స్వరూపంలో ఉన్నదే మనం కోరుకొంటున్నాము. రమణుడు అన్ని మార్గాలు సమన్వయం చేసి చెప్పటమే కాకుండా, జ్ఞానం యొక్క ప్రాముఖ్యత కూడా చెప్పారు. కర్మకు నేను కర్తను అనుకొనేవాడు కర్మ ఫలితాన్ని కోరుకొంటాడు, తాను అకర్తను అని తెలిసినవాడికి ఇంక కర్మఫలితాన్ని కోరుకొనేవాడు అక్కడ ఉండడు. యోగాలన్నీ కూడా మనకు చిత్తశుద్ధిని కలుగజేస్తాయి. మనం ఏ యోగం ద్వారా ప్రయాణం చేసినా గమ్యం ఒక్కటే. విషయచింతన చాలా ప్రమాదం అని గీతలో పరమాత్మ చెప్పాడు. విషాన్ని మనం స్మరిస్తే అది మనలను చంపదు, విషాన్ని లోపలకు తీసుకొంటే అది చంపుతుంది. విషయచింతన అలాకాదు, స్మరించినా అది మనలను చంపుతుంది. విషం కంటే విషయచింతన చాలా ప్రమాదం. మనం జీవితంలో ఎప్పుడూ వివేకం కాపాడుకొంటూ రావాలి, సొంతబుద్ధిని కాపాడుకోవాలి. మనం ఆత్మచింతన విడిచిపెడితే మనకు తెలియకుండా విషయచింతన వచ్చేస్తుంది. విషయచింతనలో నుండి ఆసక్తి కలుగుతుంది, ఆసక్తిలోనుండి కోరిక కలుగుతుంది, కోరికలోనుండి కోపం వస్తుంది, కోపం వచ్చినప్పుడు వివేకం తగ్గుతుంది, అంటే ఇది మంచి, ఇది చెడు అనే విచక్షణ తగ్గిపోతుంది, అప్పుడు బుద్ధి నెమ్మదిగా నశించి వాడు భ్రష్టుడవుతాడు.

శాస్త్రం ఏమి చెపుతోంది అంటే నీ సంసారాన్ని భుజం మీద పెట్టుకో, భగవంతుడిని బుద్ధిలో పెట్టుకో. అంతేగాని సంసారాన్ని బుద్ధిలో పెట్టుకోవద్దు. నిరంతరం ఆత్మచింతన వలన చిత్తశుద్ధి కలుగుతుంది, మనం ఏపని చేసినా త్రికరణశుద్ధిగా చేస్తే చిత్తశుద్ధి కలుగుతుంది. చిత్తశుద్ధి అనే గేటు ద్వారానే మనం మోక్షంలోనికి ప్రవేశించాలి. మనం ట్రైనింగ్ అవ్వటం కోసం ఈ భూమి మీదకు వచ్చాము. మన మాట, చేత, మనస్సు ఒకటిగా ఉండాలి, ఇలా ఉంటే మనకు చిత్తశుద్ధి కలుగుతుంది. చిత్తశుద్ధి కలిగినప్పుడు ఆత్మజ్ఞాన సముపార్జనకు అర్హత కలుగుతుంది. మీరు నేర్చుకొనే విద్య నిజమైతే ఆ విద్య వలన వినయం

వచ్చును, వినయం వలన అర్హత, యోగ్యత, పాత్రత వచ్చును. మన మనస్సు బహిర్ముఖంగా ఉన్నంత కాలం మనం ఏ మార్గాన్ని అనుసరించినా ఆత్మజ్ఞానం రాదు. ఆత్మజ్ఞానం అంటే వాస్తవమైన జ్ఞానం, మిగతావి అన్నీ మిధ్యాజ్ఞానాలు. దేహానికి రోగాలు వస్తాయి, మనస్సులో వికారాలు ఉన్నాయి. కాని లోపల ఉన్న ఆత్మ మనో దేహములకు అతీతమైనది. మనకు ఎప్పుడైనా భయం వస్తూ ఉంటే నిద్రలో ఎవరికీ భయం రాదు. స్వప్నావస్థలో, జాగ్రదవస్థలో భయం రావచ్చు, అంటే ఎక్కడైతే తలంపులు ఉన్నాయో, ఎక్కడైతే నామరూపాలు ఉన్నాయో అక్కడ భయం వస్తుంది కాని తలంపులు లేని చోట, నామరూపాలు లేనిచోట భయం ఉండనే ఉండదు. మీకు దేహధ్యాస వచ్చేటప్పటికి లోకం కనిపిస్తుంది, లోకం కనబడేటప్పటికి భయం వస్తుంది. దేహధ్యాస లేనప్పుడు లోకం కనబడదు, లోకం కనబడనప్పుడు నీకు భయం లేదు. ఎక్కడైతే నీవు ద్వంద్వరహితుడిగా ఉన్నావో అక్కడ నీకు కోరిక లేదు, కోపం లేదు, భయం లేదు.

వాస్తవజ్ఞానం లేకుండా మనకు వాస్తవం తెలియదు. వాస్తవజ్ఞానం మనకు కలిగించటానికే భగవంతుడు శారీరకతపస్సు, మానసికతపస్సు, వాక్కుతపస్సు చెప్పాడు. మనం మాట్లాడేటప్పుడు బహుజాగ్రత్తగా ఉండాలి. పురాణాలు చెప్పేటప్పుడు అవి ఎవరి గురించో చెప్పారు అనుకొంటాము కాని అవి మన గురించే చెప్పారు. ధుర్యోధనుడికి పాండవులమీద ఎప్పుడు కోపం ప్రారంభమయ్యింది అంటే చిన్న మాట వలన వచ్చింది. మయసభలో గుడ్డి వాడి కొడుకు గుడ్డివాడే అంది అక్కడ నుండి పాండవులను నాశనం చేయాలనే బుద్ధి ధుర్యోధనుడికి ప్రారంభమయ్యింది. కాలుజారితే తీసుకోవచ్చు గాని మాటజారితే తీసుకోలేము అని పెద్దలు చెపుతారు. అందుచేత మనం మాటల దగ్గర చాలా జాగ్రత్తగా ఉండాలి. మాట హితవుగా ఉండాలి, ఎదుటివారికి పాజిటివ్‌తింకింగ్ అలవాటు చెయ్యాలి, ఎప్పుడూ నెగిటివ్‌తింకింగ్‌లో ఉండకూడదు, మనం అందరి క్షేమం కోరుకోవాలి. మనం నిరంతరం దైవచింతన చేస్తూ ఉంటే ఈ లోకంలో ఏదో ఉంది మనం భోగించాలి అనే భోగవాసన నశిస్తుంది, యోగబుద్ధి కలుగుతుంది. అరుణాచలం, అరుణాచలం అని ఎవరైతే స్మరిస్తున్నారో వారి యొక్క అహంభావన నశిస్తుంది అని చెప్పారు, ఒక్క స్మరణ వలననే అహంభావన నశిస్తుందా అని భగవాన్‌ను అడిగారు, అది ఈశ్వరుడి ఆజ్ఞ అడగటానికి నువ్వెవరు అన్నారు భగవాన్.

నేను అజ్ఞానం పోగొట్టుకోవాలనుకొంటున్నాను అని ఒకరు భగవాన్‌తో అన్నారు. నన్ను పోగొట్టుకోమని అజ్ఞానం ఎప్పుడైనా నిన్ను అడిగిందా అన్నారు? అది ఎప్పుడూ అడగలేదు, నేను పోగొట్టుకోవాలనుకొంటున్నాను అని చెప్పాడు. నువ్వు నేను నేను అంటున్నావు కదా ఆ నేనును అట్టేపెట్టుకొని అజ్ఞానం పొమ్మంటే పోదు. ఆ నేను పోతే అజ్ఞానం కూడా పోతుంది, అజ్ఞానం పోతే చావు పుట్టుకలతో సంబంధం లేని చైతన్యం నీకు అనుభవంలోనికి వస్తుంది. భగవంతుడు అంటే ఉండటం. మనకి ఎప్పుడూ ఉండాలని ఉంది. మనం ఏదిగా ఉన్నామో

అది ఎప్పడూ ఉంటుంది కాబట్టి మనకు కూడా ఎప్పడూ ఉండాలని ఉంది. నేను అనేది ఒక తలంపు, నాది అనేది ఒక తలంపు. ఈ రెండు తలంపులే సంసారం. ఈ రెండు తలంపులు ఉన్నంతకాలం నిన్ను అశాంతి, దుఃఖం విడిచిపెట్టవు. మనం సాధనచేసి, సజ్జనసాంగత్యం చేసి, గురువును ఆశ్రయించి ఈ నేను, నాది అనే తలంపుల నుండి విడుదల పొందితే సంసారబుద్ధి నశిస్తుంది, ఆత్మబుద్ధి కలుగుతుంది. మన లోపలఉన్న వస్తువు మిథ్యా విద్యల వలన తెలియబడదు, వాస్తవవిద్య లేకుండా దానిని తెలుసుకోలేము. రమణ మహర్షిగారు మరణానుభవం ద్వారా అమృతానుభవం పొందారు. కొన్ని క్షణాల కాలంలో ఈ దేహంతోటి, మనస్సుతోటి, లోకంతోటి విడిపోయాడు. దేహము, మనస్సు, లోకం లేకుండా, సంకల్పాలు వికల్పాలు లేకుండా, ఈ దేహముతో ఇసుమంతయు సంబంధం లేకుండా మనము ఉన్నాము అనే అనుభవం భగవాన్‌కు కలిగింది, మృత్యువును అతిక్రమించాడు. ఆ స్థితిని మనం శరీరం ఉండగానే పొందాలి, కనీసం శరీరాన్ని విడిచిపెట్టి ప్రాణం బయటకు పోయే రోజుకైనా పొందాలి. అమృతానుభవం పొందకుండా నువ్వు ఈ శరీరాన్ని విడిచిపెడితే చాలా నష్టపోతావు. మరల పునర్జన్మ వస్తుంది.

నీ దుఃఖానికి, అశాంతికి కారణం బయటలేదు, అది నీలోపలే అహంకారరూపంలో ఉంది, అది నశిస్తే నువ్వు ద్వంద్వాలకు అతీతుడవు అవుతావు. సుఖం వస్తూ ఉంటుంది వెళ్ళిపోతూ ఉంటుంది, దుఃఖం వస్తూ ఉంటుంది, వెళ్ళి పోతూ ఉంటుంది, లాభం వస్తూ ఉంటుంది, వెళ్ళిపోతూ ఉంటుంది, నష్టం వస్తూ ఉంటుంది వెళ్ళిపోతూ ఉంటుంది. ఈ ద్వంద్వాలను సహించటం నేర్చుకో. సహనం అనేది నేను భూమిని చూసి నేర్చుకొన్నాను అని దత్తాత్రేయుడు అన్నాడు. మనం చెరకుగెడను కొడవలి పెట్టి కోస్తూ ఉంటే ఆ చెరుకుగెడ కొడవలికి తీపినే ఇస్తుంది కాని చేదును ఇవ్వదు ఎందుచేత అది చెరుకుగెడ స్వభావం. ఇతరులు నిన్ను ఎంత ఇబ్బంది పెట్టినా నువ్వు చెరుకుగెడలా ఉండు. అప్పడు నీవు దైవానుగ్రహానికి పాత్రుడవు అవుతావు. నువ్వు దైవానుగ్రహానికి ఎప్పడైతే పాత్రుడవు అయ్యావో అప్పడు దైవం నీకు స్వరూపంగా వ్యక్తమవుతాడు. దేహము నేను అనే తలంపును బట్టి మనకు ఇతర తలంపులు వస్తున్నాయి. దేహము నేను అనే తలంపులేనివాడికి అసలు ఇతర తలంపులు రానేరావు. అందుచేత దేహాభిమానం తగ్గించుకోవటమే నిజమైన సాధన, దేహాభిమానం తగ్గించుకొన్నవాడికి ప్లెజర్ ఉండదు, పెయిన్ ఉండదు, దేహంతో తాదాత్మ్యం ఉన్నవాడికే ఇవి రెండూ ఉంటాయి. వియోగం ఉన్నవాడికి యోగం కావాలి కాని వియోగం లేనివాడికి యోగంతో పని ఏముంది? నువ్వు గురువును వాడు దేహము, వాడు దేహము అనుకొన్నా తాను దేహం కాదు, తాను ఆత్మ అని గురువుకు తెలుసు. గురువులో ఉన్నదే మన అందరిలోనూ ఉంది. మనలను చూసేటప్పడు కూడా తన్ను తాను చూసుకొంటాడు, వాడే జ్ఞాని, వాడే గురువు. మనకు దేహాభిమానం ఉంది కాబట్టి గురువును కూడా దేహ మాత్రుడిగా చూస్తాము. గురువు అంటే దేహమాత్రుడు కాదు

అందుచేత ఆ దేహం పోయినా గురువుతో అనుబంధం అలా కొనసాగుతూనే ఉంటుంది. మనకు ఉన్న దేహభావం, శవభావం పోగొట్టి ఆయన ఏ స్థితిలో ఉన్నాడో ఆ స్థితిని మనం పొందేవరకు మనలను వెంటాడతాడు, వాడు గురువు. మనకు ఎప్పుడైనా గురువు జ్ఞాపకం వస్తున్నాడు అనుకోండి అది మన తెలివి కాదు, మన వివేకం కాదు, అది గురువు యొక్క దయ అని తెలుసుకొన్నవాడు ధన్యుడు.

అంతా ఆత్మే, అంతా చైతన్యమే, అంతా ఈశ్వరుడే అది తప్పించి రెండోది లేనేలేదు, ఉందని నీవు అనుకొంటే అది నీ భ్రాంతి. తాను కర్తను కాదు అని తెలుసుకొన్నవాడి ద్వారా జరుగుతున్న మహత్తర కర్మ కర్తృత్వం ఉన్నవాడి ద్వారా జరుగదు. ఈ విషయాలు మనకు గ్రహింపుకు వస్తూ ఉంటే, దాని వల్ల ప్రయోజనం తెలుస్తూ ఉంటే కర్తృత్వం లేని స్థితిని పొందటానికి ప్రయత్నం చేస్తాము. మీకు ధనం ఉంటే దానిని సద్వినియోగం చేసుకోండి, మీకు వివేకం ఉంటే దానిని సద్వినియోగం చేసుకోండి. భగవంతుడు మీకు ఇచ్చిన అవకాశములు సద్వినియోగం చేసుకొంటూ ఉంటే గుణాతీత స్థితిని పొందుతారు. మనకు సత్వగుణం, రజోగుణం, తమోగుణం ఈ మూడు గుణాలు తిరుగుతూ ఉంటాయి. సత్వ గుణంలో ఉన్నప్పుడు మీ శరీరం, మనస్సు దూదిలా ఉంటాయి, మీకు స్పష్టత ఉంటుంది, ఆలోచన యొక్క లోతులు పెరుగుతాయి. సత్వగుణం ఉన్నప్పుడు మీ మనస్సు మీకు సహకరిస్తుంది కాని మీకు విరోధిగా ఉండదు. సత్వగుణం వచ్చినప్పుడు దానిని నెమ్మదిగా పొడిగించుకోవటానికి ప్రయత్నం చేయాలి. సత్వగుణం మనకు దైవం దగ్గరకు దారి చూపించి అది ప్రక్కకు తప్పకొంటుంది. మనం సాధ్యమైనంతవరకు రియాక్షన్ తగ్గించుకోవాలి. పాజిటివ్‌తింకింగ్ పెంచుకోవాలి. పాజిటివ్‌తింకింగ్ పెరిగే స్నేహాలు చెయ్యాలి, అదే సజ్జనసాంగత్యం. నువ్వు ఇంటి దగ్గర ఉన్నా, ఎక్కడ ఉన్నా, తెల్లబట్టలు కట్టుకొన్నా, ఎర్రబట్టలు కట్టుకొన్నా మనస్సును నిగ్రహించుకోవటం నేర్చుకోవాలి. నువ్వు కొద్దిగా వివేకం సంపాదించినా, ధ్యానం సంపాదించినా ఇంద్రియనిగ్రహం లేనప్పుడు, మనో నిగ్రహం లేనప్పుడు అది నిలుస్తుందా? ఆ వివేకం, ధ్యానం నిలబడదు, ప్రకృతి ప్రవాహంలో కొట్టుకొని పోతుంది. ఈశ్వరానుగ్రహం లేకుండా ఒక్క వాసన కూడా క్షయించదు. నీకు వేరుతో సహా వాసనాక్షయం అయినప్పుడే జ్ఞానోదయం కలుగుతుంది కాని లేకపోతే ఇంకో అవకాశం లేదు. భగవంతుడి యొక్క నామాన్ని స్మరించటం వలన, ఆయన రూపాన్ని ధ్యానించటం వలన ఏకాగ్రత వస్తుంది.

మన హృదయంలో ఒక నిజం ఉంది, అది నీకు తెలియటం లేదు, అది తెలుసుకొనే వరకు ప్రకృతి నిన్ను విడిచిపెట్టదు. అది తెలియకుండా నీ కోరికలు, వాసనలు, తలంపులు, అలవాట్లు ఏవో అడ్డు వస్తున్నాయి, ఇవి అన్నీ నీ మనస్సులో ఉన్నాయి. మన శరీరం చనిపోయినప్పుడు శరీరంతో తాదాత్మ్యం పొందే మనస్సు చనిపోదు. భౌతికమైన అగ్ని వలన శరీరం కాలుతుంది కాని మనస్సు కాలదు, జ్ఞానాగ్ని వలన మనస్సు కాలిపోతుంది. ఓ

అరుణాచలేశ్వరుడా! భౌతికమైన అగ్ని ఈ శరీరాన్ని కాల్చిబూడిద చేయకముందే నీ జ్ఞానాగ్నిని పంపించి దేహంతో తాదాత్మ్యం పొందే నేనును కాల్చి బూడిద చెయ్యి అంటున్నారు భగవాన్. ఉన్నదేదో ఉంది, అది తప్పించి అంతా మాయ. ఆ ఉన్న వస్తువును తెలుసుకోవటం మానేసి పూర్వజన్మలలో ఎక్కడ పుట్టాము, రాబోయే జన్మలలో ఎక్కడ ఉంటాము, ఏ లోకాలకు వెళతాము అంటే ఇవన్నీ అనాత్మ గొడవలు. అనాత్మగొడవలలోనికి వెళ్ళి కాలాన్ని పాడు చేసుకోవద్దు. అనాత్మగొడవలలోనికి వెళితే చిక్కులు వస్తాయి, చివరకు వళ్ళు నొప్పలు మిగులుతాయి గాని సత్యజ్ఞానం కలుగదు. రాబోయే జన్మల గురించి ఎవరైనా భగవాన్‌ను అడిగితే అసలు ఇప్పడు పుట్టలేదుకదా, ఇంక రాబోయేజన్మ ఏమిటి? ఈ జన్మ ఎంత అబద్ధమో రాబోయేజన్మ కూడా అంతే అబద్ధం. ఒక గోతిలో నుండి కాలు తీయటం ఇంకో గోతిలో పెట్టటం, ఆ గోతిలో నుండి తీయటం ఇంకో గోతిలో పెట్టటం, ఈ జన్మలు కూడా అంతే. ఇది అంతా రాంగ్‌తింకింగ్‌లో నుండి వస్తోంది. అసలు మనకు రైట్‌తింకింగ్ లేదు, రైట్‌డైరెక్షన్ లేదు, రైట్‌గురువు లేడు. లోకవాసన, శాస్త్రవాసన, దేహవాసన లేకుండా మనలను ప్రేమించేవాడు లేడు, అలా ఎవడైనా మనలను ప్రేమించాలంటే వాడు ఆత్మ అయి ఉండాలి. మనం చూసే ప్రేమలు నిజం కాదు, అది కూడా వ్యాపారమే. ఒక్క జ్ఞాని మాత్రమే ప్రేమించగలడు ఎందుచేతనంటే ప్రేమే ఆయన స్వరూపం.

నీ హృదయంలో ఉన్న నిజం నీకు తెలియటం లేదు, అది నీకు అందితే గాని దాని తాలుక వైభవం, సుఖం, శాంతి నీకు తెలియవు. మన ఇంట్లో భూమిలో బంగారం ఉంది అనుకోండి, అక్కడ బంగారం ఉందని మీకు తెలియదు అనుకోండి, ఇంట్లో దారిద్ర్యం అనుభవిస్తున్నారు అనుకోండి. మనం ఎందుకు దారిద్ర్యం అనుభవిస్తున్నాము అంటే మన ఇంట్లో బంగారం ఉన్నా అది మనకు తెలియటం లేదు కాబట్టి దారిద్ర్యం అనుభవిస్తున్నాము. మనం దుఃఖం, అశాంతి ఎందుకు అనుభవిస్తున్నాము అంటే మన హృదయంలో నిజం ఉన్నా అది మనకు తెలియకపోవటం వలన దుఃఖంతో, అశాంతితో కాలిపోతున్నాము. నీకు వాస్తవజ్ఞానం వచ్చేవరకు మిధ్యాజ్ఞానాన్నే వాస్తవజ్ఞానం అనుకొంటావు. సబ్జక్టును అర్థం చేసుకోవటం చాలా ముఖ్యం. బుద్ధిసూక్ష్మతను అభివృద్ధి చేసుకోవాలి. మీ హృదయంలో ఒక నిజం ఉంది. అది మీకు తెలియటం లేదు, దానిని తెలుసుకోవటానికి ఏదో అడ్డు వస్తోంది అని మీకు తెలుస్తోంది. మీరు నిజాన్ని తెలుసుకోవటానికి చేసే ప్రయత్నంలో లోపల ఏ ఆటంకాలు అయితే అడ్డు వస్తున్నాయో ఆ ఆటంకాలు మీకు జ్ఞాపకం రాకుండా ఉండటమే ఏకాగ్రత. అటువంటి ఏకాగ్రతను కృషిచేసి సంపాదించుకోవాలి. మనిషి పాడైపోవటానికి ఒక్క అలవాటు చాలు. అంటే అలవాట్ల యొక్క వేగం అటువంటిది. అసలు అలవాట్ల యొక్క వేగం వలననే లోపల సత్యవస్తువు ఉందనే ధ్యాస కూడా మనకు రావటం లేదు, లోపల సత్యవస్తువు ఉంది ఒకవేళ దానిని తెలుసుకోవాలనే బుద్ధి మీకు కలిగింది అనుకోండి

అప్పుడు ఈ అలవాట్లు అడ్డు వచ్చేస్తాయి. ఆ అలవాట్లు మీకు గుర్తుకు రాకుండా ఉండటమే ఏకాగ్రత. మాకు దుఃఖం వస్తోంది, మా ఇంటిదగ్గర పరిస్థితులు బాగాలేదు అని ఎవరైనా భగవాన్‌తో అంటే నీ దుఃఖం, నీ ఇంటిదగ్గర పరిస్థితులు బాగాలేకపోవటం ఇవన్నీ కలిసి నిన్ను అంతర్ముఖుడిని చేస్తే మంచిదే కదా అనేవారు. సాధకుడికి వాడు ఏ మతస్థుడు అనిగాని, వాడి గురువు ఎవరు అనేది గాని ముఖ్యంకాదు, వాడు అసలు అంతర్ముఖుడు అవుతున్నాడా అనేది ముఖ్యం. అంతర్ముఖుడు కానివాడికి ఆత్మజ్ఞానం కలుగదు.

ఆత్మజ్ఞానం వలన వచ్చే శాంతిని మన ఇంద్రియాలు కాని, మన బుద్ధి కాని పట్టుకోలేవు. ఈ శాంతి ఇంద్రియాల ద్వారా రావటం లేదు, ఏదో ఒక విషయాన్ని గ్రహించటం వలన రావటం లేదు, ఎక్కడ నుండో వచ్చి మన సహస్రారాన్ని ముంచేస్తుంది అని మిమ్మల్ని చూసి మీకే ఆశ్చర్యం కలుగుతుంది. దానిని మీరు నోటితో చెప్పలేరు, మనస్సుతో ఊహించలేరు అట్టిది ఆత్మశాంతి. అప్పుడు మీకు బాహ్యంగా ఎంత అశాంతి వచ్చినా, దుఃఖం వచ్చినా మీకు ఎర్రచీమ కుట్టినట్లుగా కూడా ఉండదు, ఒకవేళ ఈ దేహానికి చావు వచ్చినా మీకు ఏమీ అనిపించదు, అది జ్ఞానం యొక్క వైభవం. ఈ లోకంలోగాని, పరలోకంలోగాని జ్ఞానానికి మించిన వస్తువుకాని, జ్ఞానంతో సమానమైన వస్తువుగాని లేనేలేదు. అట్టి జ్ఞానాన్ని గురువును ఆశ్రయించి సంపాదించుకో అని పరమాత్మ చెపుతున్నాడు. మనం ఆసక్తి లేకుండా పనిచేస్తూ ఉంటే ముందు అశాంతి తగ్గిపోతుంది. పట్టించుకోవలసింది పట్టించుకో. నీ చేతిలో ఉన్న పనిని శ్రద్ధగా చెయ్యి. మిగతాది ఈశ్వరుడికి వదిలెయ్యి. అప్పుడు రోజులు శాంతిగా వెళ్ళిపోతాయి. సన్యాసం అంటే ఇల్లు విడిచిపెట్టి పారిపోవటం కాదు, అక్కడ మనస్సు ఉంటుంది కదా. ఇంటి మీద మమకారం విడిచిపెట్టి పనిచేసుకోండి, అప్పుడు జ్ఞానం సంపాదించటానికి మీకు మార్గం సుగమం అవుతుంది. వాడు సన్యాసా లేక వాడు గృహస్థాశ్రమంలో ఉన్నాడా అనేది ముఖ్యంకాదు, వాడికి లోచూపు కలుగుతోందా అనేది ముఖ్యం. లోకవాసన, దేహవాసన ఉన్న వాడికి భయం, ఇవి రెండూ లేనివాడికి భయం ఏమిటి? భయం అనేది కూడా నిజం కాదు, అది ఒక తలంపు. మొదటి తలంపు అహంకారం, అహంకారం లేకుండా ఏ తలంపు రాదు. ఈ మొదటి తలంపు లోపల నుండి వస్తోందా, బయట నుండి వస్తోందా? అది లోపల నుండే వస్తోంది. అది ఎక్కడ నుండి వస్తోందో విచారణ చేసి తెలుసుకోవటమే జ్ఞానమార్గం. అది నువ్వు చెయ్యలేకపోతున్నావు అనుకో శరణాగతి చెయ్యి.

పని విడిచిపెడితే జ్ఞానంరాదు, సోమరితనం వస్తుంది. మనస్సు అణిగిన వాడికి జ్ఞానం వస్తుంది. మనస్సు అణగకపోతే ఏ ఆశ్రమంలో ఉన్నా వాడికి జ్ఞానంరాదు. మనం చెప్పకొనే మాటలకంటే, జపాలు ధ్యానాలకంటే రమణమహర్షిగారు ఏమి చేసారు అని జ్ఞానం వచ్చింది. ఒక మహాచైతన్యం వచ్చి ఆయనను ఆక్రమించుకొని అనాత్మలోనుండి ఆత్మలోనికి గెంటివేసింది. అది మనం ఏదో చెయ్యటం వలన రాదు, మనం ఏదైతే

పొందుదామనుకొంటున్నామో దాని దయ వలన మాత్రమే దానిని మనం పొందగలము. ప్రాణమూలం, మంత్రమూలం, మూలతలంపు యొక్క మూలం ఈ మూడు ఒక్కచోటనే ఉంది, అక్కడే సత్యం ఉంది. అక్కడకు చేరుకొనేవరకు నీకు సత్యం తెలియదు. ఏవో కబుర్లు చెప్పటం వలన అది నీకు తెలియదు. నువ్వు డీపెన్ అవ్వాలి. మనో మూలంలోనికి వెళ్ళాలంటే అభ్యాసం, వైరాగ్యం ఉండాలి. ఈ రెండింటి యొక్క సహకారంతోనే నీవు మనో మూలంలోనికి వెళ్ళగలవు లేకపోతే వెళ్ళే అవకాశం లేదు. ఎక్కడ గడ్డిమేటు కనిపిస్తే అది నాకు కావాలి అనుకొనేవాడికి ఇంక జ్ఞానం ఏమిటి? మనస్సు అణగకుండా ఆత్మజ్ఞానం రాదు. మనకు మనస్సు విజృంభిస్తోంది కాని అణగటం లేదు. విషయచింతన వలన మనస్సు విజృంభిస్తుంది, ఆత్మచింతన వలన అణిగిపోతుంది. విషయచింతన చేస్తూ ఉంటే మనస్సు ఆరోజుకారోజు విజృంభిస్తూ ఉంటుంది, చివరకు మనిషి భ్రష్టుడవుతాడు. మనస్సు ఏ విషయాలనైతే కల్పిస్తుందో మనస్సు అణిగిపోతే ఆ విషయాలు అన్నీ అణిగిపోతాయి. మనం మనస్సును అట్టేపెట్టుకొని విషయాలు అణగాలంటే అణగవు. ఎక్కడ చూసినా ఇష్టం, అయిష్టం, ఈ రెండింటి వలన మనకు ఏమైనా కలిసి వస్తోందా అంటే ఏమీలేదు. ఈ ఇష్టాయిష్టముల వలన ఎంత ఎనర్జీ పోతోందో మనకు తెలియటం లేదు. ఈ రెండు వదిలేసాము అనుకోండి మనకు ఎనర్జీ స్టోర్ అవుతుంది.

జ్ఞాని చేసేపని సహజంగానే ఉంటుంది. తాను అకర్తను అని ఆయనకు తెలుసు కాబట్టి టెన్షన్‌లు ఉండవు. లోకం ఎంత ప్రయత్నం చేసినా వాడికి దుఃఖస్పర్శ తీసుకురాలేదు. నువ్వు ఏది కాదో దానితో తాదాత్మ్యం పొందుతున్నావు, నువ్వు ఆ తాదాత్మ్యంలో నుండి విడుదల అవ్వాలి, అదే సాధన యొక్క గమ్యం. ఒక్కడికి జ్ఞానం కలిగింది అనుకోండి, వాడి ప్రేమ ఈ సృష్టి అంతా వ్యాపిస్తుంది. మనస్సుకు హద్దులు ఉంటాయి, ఆత్మకు హద్దులు లేవు, ఇతరులు లేరు, స్వపర బేధం లేదు. భగవాన్ ఇల్లు విడిచి అరుణాచలం వచ్చారు, ఆయన కోపంతో ఇల్లువిడిచి రాలేదు, తిరుచ్చుళి వదిలి అరుణాచలం వెళ్ళాలని సంకల్పించుకొని రాలేదు, అనుకొని రావటంకాదు, అది అంతా ఆటోమేటిక్ డివైన్‌యాక్షన్, అది సహజంగా జరిగిపోతూ ఉంటుంది. మనకు కర్తృత్వం ఎప్పుడైతే లేదో మన ఇంటర్‌ఫియరెన్స్ లేకుండా ఏ పని ఎప్పుడు జరగాలో అలా జరిగిపోతూ ఉంటుంది. మన ఇంటర్‌ఫియరెన్స్ లేనప్పుడు మనం శాంతిగానే ఉంటాము. నీకు నాకు బాగా స్నేహం కదా అరుణాచలం వచ్చేటప్పుడు నాతో చెప్పకుండా వచ్చేసావు ఏమిటి అని ఒకరు భగవాన్‌ను అడిగితే నేను వస్తానని నాకే తెలియదు ఇంక నీకు ఏమి చెప్తాను అన్నారు.

భగవాన్ పుట్టినది శివక్షేత్రం, ఆయనకు జ్ఞానం కలిగింది శివక్షేత్రం, ఆయన దేహం 54 సంవత్సరాలు అరుణాచలంలో తిరుగాడింది, అదీ శివక్షేత్రమే. ఆయనకు ఏదో చెయ్యటం వలన జ్ఞానం రాలేదు, వాస్తవంగా ఉన్న వస్తువే ఆయనను ఆక్రమించుకొంది. అందుచేత

మనం చేసేది తక్కువే కాని అటువైపు నుండి వచ్చేది ఎక్కువ. ఆయన అనుగ్రహం వలననే అంతా వచ్చింది అని హృదయగుహలోనికి వెళ్ళాక మనకు తెలుస్తుంది. మనం గుడిలో ఉన్న ఈశ్వరుడిని చూస్తున్నాముగాని ఇంక గుహలో ఉన్న ఈశ్వరుడిని చూడటంలేదు. గుహలో ఉన్న ఈశ్వరుడు తప్పించి ఈ సృష్టిలో అన్నీ అసత్యములే, అన్నీ మనం కల్పించుకొన్నవే. మీరు పూజ చేస్తున్నా, జపం చేస్తున్నా, ధ్యానం చేస్తున్నా గమ్యం మర్చిపోకూడదు, మనకు గమ్యం ఎక్కువ గుర్తుకు వస్తూ ఉంటే తక్కువ తప్పులు చేస్తాము. మనం పాలకొల్లు నడిచివెళు తున్నాము అనుకోండి, అడుగులు లెక్కపెట్టుకొంటామా? పెట్టుకోము. నువ్వు చేసే సాధన కూడా అలాగే ఉండాలి, అంత నార్మల్‌గా, నేచురల్‌గా ఉండాలి, నువ్వు అలా చేస్తూ ఉంటే చెట్టునున్న పిందె కాయ అవుతుంది, అది బాగా ముగ్గి పండు అయిన తరువాత అది చెట్టు నుండి ఎంత సహజంగా విడిపోతుందో అంత సహజంగా నీవు అజ్ఞానంలో నుండి బయటకు వచ్చేస్తావు. నీకు అర్హత లేకుండా ఇంకా జ్ఞానం రాలేదేమిటి అని కంగారుపడితే ఎప్పడు తినేద్దామా అని పచ్చికాయను ముగ్గేస్తే అది ఎలా కుళ్ళిపోతుందో మనం కూడా అలాగే తయారవుతాము. మనకు ఎప్పడు, ఎలాగ, ఎక్కడ జ్ఞానం ఇవ్వాలి అనేది ఆ ముహూర్తం ఆయనే పెట్టుకొంటాడు. ఈలోపుగా మనం కంగారుపడకూడదు.

మనం రాగద్వేషాలు పెట్టుకొనే కొలది మన స్వరూపానికి దూరమైపోతాము. మరల రాబోయే జన్మలో కష్టపడి సాధన చేస్తే గాని మరల స్వరూపానికి దగ్గరకు రాలేము. స్వరూపాన్ని విడిచిపెట్టి ఎంతదూరం వెళ్ళామో మరల అంత దూరం వెనక్కి వస్తేగాని హృదయ గుహలో పడము. ఆత్మచింతన విడిచిపెట్టి విషయచింతనలో పడితే మీకు ఆసక్తి కలుగుతుంది. ఆసక్తిలో నుండి కోరిక వస్తుంది, కోరికలో నుండి కోపం వస్తుంది, కోపం ఎక్కువయ్యే కొలది బుద్ధిపాడవుతుంది, బుద్ధిపాడయ్యే కొలది ఆరోజుకారోజు మనిషి భ్రష్టుడవుతాడు. మనస్సు ఉన్నంతసేపు ఏదో ఒకటి చింతించకుండా ఉండలేము. అందుచేత ఏది చింతిస్తే మనస్సు నశిస్తుందో దానిని చింతించాలి. మీ దేహం ఎక్కడ ఉంది అనేది ప్రధానం కాదు, మీ మనస్సు ఎక్కడ ఉంది అనేది ముఖ్యం. మీరు అరుణాచలంలో ఉండి భీమవరాన్ని స్మరించటంకంటే, భీమవరంలో ఉండి అరుణాచలాన్ని స్మరించటం మంచిది. ఏది చింతిస్తూ ఉంటే అదే మనం అవుతాము. విషయచింతన లోనికి వెళితేలోకం, ఆత్మచింతన లోనికి వెళితే దేవుడు, అదీ నీ ఎదురుగా ఉంది, ఇదీ నీ ఎదురుగా ఉంది. నువ్వు జాగ్రత్తగా వివేకాన్ని, బుద్ధిని ఉపయోగించుకొని మార్గం అన్వేషించుకొని బాగుపడు. మీకు ఏదైనా కష్టం వచ్చింది అనుకోండి, బాధ వచ్చింది అనుకోండి. ఆ కష్టాన్ని, బాధను మీరు భరించ గలుగుతున్నారు అనుకోండి, సహించగలుగుతున్నారు అనుకోండి అది కూడా తపస్సు అని మర్చిపోవద్దు. మీరు సహించగలుగుతూ ఉంటే ఈ ప్రాణాయామాలు, ధ్యానాలు చేసిన దానికంటే ఎక్కువ ఫలితం వస్తుంది.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 20-12-2007, కాపవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజున గీతాజయంతి. ప్రపంచంలో ఏదైనా ఒక గ్రంథానికి జయంతి చేస్తున్నారు అంటే ఒక్క భగవద్గీతకు తప్పించి ఏ గ్రంథానికి చెయ్యరు. గీతామాత అంటారు, మాత అనే పేరు కూడా భగవద్గీతకే వచ్చింది. చెడ్డ పిల్లలు ఉంటారుగాని చెడ్డతల్లి ఉండదు. కొడుకు తల్లిని చంపి ఆ తలకాయ పట్టుకెళ్ళేటప్పుడు కూడా నన్ను చంపేసినా వీడు మాత్రం క్షేమంగానే ఉండాలి అని ఆ తల్లి అనుకొంటుందట, ఈ స్థానం ఒక్క తల్లికే ఉంది. మనుషులు రకరకాల గుణాలతో ఉంటారు కాని ఎవరినీ విడిచిపెట్టకుండా అందరినీ ప్రేమిస్తుంది గీతామాత, వాడు ఎంత దురాచారి అయినా వాడిని ప్రేమిస్తుంది, అది గీత గొప్పతనం. ఇన్ని రకాల గుణాలు ఉన్న మనుషులను సమన్వయం చేసుకొని అందరినీ సమానంగా చూస్తూ, ఎవరికి తగిన స్థాయిలో వారికి భోదిస్తూ, అందరికి మోక్షసుఖం కలుగజెయ్యాలనుకొనే గ్రంథరాజము భగవద్గీత. కృష్ణుడు కృష్ణుడిగా చెప్పలేదు, భగవంతుడై చెప్పాడు కాబట్టి దానికి భగవద్గీత అని పేరు వచ్చింది. గీత, గంగ, గాయత్రి, గోవింద అని మన సాంప్రదాయంలో చెపుతారు. ఒక్క గీతా గ్రంథం చదివి అర్థం చేసుకొంటే ప్రపంచంలో అన్ని గ్రంథాలు చదివినట్లే, గంగానదిలో స్నానం చేస్తే ప్రపంచంలో ఉన్న అన్ని నదులలో మీరు స్నానం చేసినట్లే, అన్ని మంత్రాలు చేసిన వారికి ఎంత ఫలితం వస్తుందో ఒక్క గాయత్రి చేస్తే అంత ఫలితం వస్తుంది, గోవిందుడికి నమస్కారం పెడితే అందరు దేవతలకు నమస్కారం పెట్టినట్లే, కొంతమంది అన్ని ఏకాదశులు బాగా చేస్తారు, మిగతావి చేయలేకపోయినా చాలామంది ముక్కోటి ఏకాదశి శ్రద్ధగా చేస్తారు. మహావిష్ణువు తొలిఏకాదశి రోజున యోగనిద్రలోనికి వెళతాడు, మరల ముక్కోటిఏకాదశి రోజున వైకుంఠంలో మేల్కొని ఉత్తరద్వారంలో ముక్కోటి దేవతలకు దర్శనమిస్తాడు. మూడుకోట్ల దేవతలకు దర్శనమిచ్చాడు కాబట్టి ఈ రోజును ముక్కోటి ఏకాదశి అంటారు. తిరుపతిలోను, భద్రాచలంలోను ఈరోజు స్వామివారిని ఉత్తరద్వారం గుండా దర్శనం చేయిస్తారు. శైవులు శివరాత్రిని ఎంత శ్రద్ధగా చేస్తారో వైష్ణవులు ముక్కోటి ఏకాదశిని అంత శ్రద్ధగా చేస్తారు.

మీరు చేసే పూజలు, జపాల కంటే, మీరు చేసే సాధనల కంటే ఆహారనియమం గొప్పది, ఆహారనియమానికి మించిన నియమం లేదు. మీరు ఆహారంలో నూనె సరుకులు తినకుండా, మీ శరీరానికి ఏమి పడవో అవి జాగ్రత్తగా చూసుకొంటూ వాటిని తగ్గించుకొని తిండిదగ్గర మీరు జాగ్రత్తగా ఉంటే ఆధ్యాత్మికంగా నూటికి ఏభైమార్కులు వచ్చేస్తాయి. సాధన చేసినా ఆహారనియమం లేనివారు ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రాలేరు. ఆహారనియమం వలన శారీరకఆరోగ్యం, మానసికఆరోగ్యం రెండూ బాగుంటాయి. ఆహార నియమంలో మనం గాంధీగారిని ఆదర్శంగా పెట్టుకోవాలి. భజగోవింద శ్లోకాలలో గోవిందుడిని భజించు అని చెపుతూ, గోవిందుడి రూపాన్ని ధ్యానం చేసుకో, భగవద్గీతను అధ్యయనం చెయ్యి, విష్ణు

సహస్రనామాలను పారాయణ చేసుకో నువ్వు తరిస్తావు అని ఆచార్యులవారు చెప్పారు. భగవద్గీతను కొంచెం అధ్యయనం చేసినా అందులో ఒక్క శ్లోకం నీకు అర్థమైనా నువ్వు తరిస్తావు అని ఆచార్యులవారు చెప్పారు. కామక్రోధాలు రజోగుణంలో నుండి వస్తాయి. కామక్రోధాల యొక్క విజృంభణ తగ్గకపోతే నీకు లోచూపు కలుగదు, లోచూపు లేకపోతే లోపల అంతర్యామిగా ఉన్న పరమాత్మ దర్శనం కూడా సాధ్యం కాదు. గీతలో పరమాత్మ మూడు మాటలు చెప్పాడు. 1. డివోషన్, 2. డిటర్మినేషన్, 3. డిస్క్రిమినేషన్. మహావిష్ణువు పాదాలయందు భక్తి కలిగి ఉండాలి. భక్తి వలన నీకు యోగం సిద్ధిస్తుంది. ఈశ్వరుడి పాదాలయందు భక్తి కలగాలంటే, నీకు నిష్ఠ కలగాలంటే నీకు పట్టుదల ఉండాలి అంటే నిశ్చయం ఉండాలి. ఆ నిశ్చయం లేకపోతే నీ మనస్సు చెదిరిపోతూ ఉంటుంది, ప్రపంచంలో ఉన్న ఏదో ఆకర్షణ నిన్ను ఈడ్చుకొని పోతుంది. ఇంక డిస్క్రిమినేషన్ అంటే విడగొట్టుకోవాలి. అంటే ఏది తానో దానిని గట్టిగా పట్టుకోవాలి. తాను కానిదాని మీద వైరాగ్యం పెంచుకోవాలి. అంటే ఆత్మజ్ఞానసముపార్జనకు ప్రయత్నం చేయాలి, ఆత్మకానిదాని యందు వైరాగ్యం కలిగిఉండాలి, అది వివేకం వలన వస్తుంది. ఏది తినాలి, ఏది తినకూడదు, ఎవరితో స్నేహం చేయాలి, ఎవరితో స్నేహం చేయకూడదు అని బుద్ధితో విడగొట్టుకుంటే మనకు దారి కనిపిస్తుంది.

భగవాన్ అన్నారు సజ్జనసాంగత్యం వలన సాధన అనే పెట్టుబడి లేకుండా బుద్ధిలో ఉన్న దోషాల నుండి బయటకు వచ్చేయవచ్చు అన్నారు. సజ్జనులు నీ బుద్ధిలో ఉన్న దోషాలను పోగొట్టుకోమని చెప్పరు, వారి ప్రభావం వలన దోషాలు అన్నీ పోతాయి, సజ్జనసాంగత్యం యొక్క వైభవం అట్టిది. రోజూ గంటల తరబడి టీవీ చూస్తూ ఉంటే మీకు తెలియకుండా మీ బుద్ధి మలినమవుతుంది. అందుచేత చూసే విషయాలలో, వినే విషయాలలో, మాట్లాడే విషయాలలో బహుజాగ్రత్తగా ఉండండి. మనస్సు ఎంతవరకు అంతర్ముఖమవుతోంది అని చూసుకోవాలి. మనం సంపదలు వస్తే ఒకరకంగా ఉంటాము, ఆపదలు వస్తే ఒక రకంగా ఉంటాము. ఈ సంపదలు, ఆపదలు అన్నీ కాలప్రవాహంలో కొట్టుకొనిపోతాయి, ఇవి ఏమీ నిలబడవు. అంతర్ముఖుడు సంపదలతో గాని, ఆపదలతో గాని జతకట్టడు. ధనగర్వం, అధికారగర్వం, కులగర్వం ఇవి పనికిరావు, ఇవి ఉన్నవాడికి వినయం రాదు. వినయం లేకపోతే మనస్సు అణగదు. సాధన చేసినా ఈ గర్వాలు మనస్సును అంతర్ముఖం కానివ్వవు. అందుచేత మీరు తెలివితో ఈ విషయాలను బాగా అర్థం చేసుకోవాలి. మీ హృదయంలో ఏది ఉందో భగవంతుడు ఖచ్చితంగా ఎక్స్‌రే తీసినట్లు చెప్పగలడు, ఎందుచేతనంటే ఆయన అంతర్యామిగా మీ లోపల ఉన్నాడు. భగవంతుడు కర్మసాక్షి మీ లోపల సాక్షిగా ఉండి అంతా చూస్తూ మరల మనం అనుభవించటానికి కర్మ బ్యాంక్‌లో పడేస్తాడు, ఎవళ్ళ ఎక్కౌంట్ వాళ్ళదే, ఆ టైము చూసుకొని ఒకో కర్మను, ఒకో కర్మను పంపిస్తూ ఉంటాడు. మీరు ఎవరితోనూ శత్రుత్వం పెట్టుకోవద్దు, అధికంగా మిత్రత్వం పెట్టుకోవద్దు, వీటివలన కాలం వృధా అయిపోతుంది. కోరికలు ఉన్నవారికి,

భోగవాంఛ ఉన్నవారికి ఈ ప్రపంచంగాని లేకపోతే ఈ ప్రపంచంతో మనకు పని ఏముంది? నువ్వు ఏమి చేస్తావు, నువ్వు ఏమి చెయ్యగలవు, నీ వల్ల ఏమీ కాదు, అంతా ఈశ్వరసంకల్పానికి వదిలెయ్యి. నీ చేతిలో ఉన్న పనిని శ్రద్ధగా చెయ్యి, నువ్వు చెయ్యగలిగింది ఏదో చెయ్యి. కృష్ణుడు ఆయుధం పట్టను అంటే ఆయుధం పట్టనివాడు మనకెందుకు అనుకొన్నాడు ధుర్యోధనుడు. భగవంతుడు ఆయుధం లేకుండా యుద్ధం చేయగలడు అనే బుద్ధి వాడికి లేదు. ఊరికే గుర్రాలు తోలినట్లు నటించి అందరినీ ఊడ్చేస్తాడు, వాడు భగవంతుడు. మనకు భక్తి లేదు, భక్తి ఉంటే భగవంతుడి యొక్క వైభవం మనకు తెలుస్తుంది. భగవాన్ చెప్పేది ఏమిటి అంటే నువ్వు ఏదిగా ఉన్నావో ఆ పదార్థంగా ఉండగలిగితే నిన్ను అనాత్మ ఆకర్షించదు. నీకు ఆత్మనిష్ఠ కుదిరితే, ఆత్మధ్యాస కుదిరితే అనాత్మ నీ జోలికి రాదు, నిన్ను ఆకర్షించదు. దైవాన్ని వదిలేసావు అనుకో ప్రకృతిలో పడిపోతావు.

మనకు కోరిక వచ్చింది అనుకో, దానిని వెంటనే నెరవేర్చుకోవటం కంటే దానిని నిగ్రహించుకోవటం వలన కాలప్రవాహంలో ఎక్కువ శాంతిని తీసుకొని వస్తుంది. అసలు మనస్సు అనేది లేదు అంటారు భగవాన్. నీ నీడను చూసి నువ్వు అనుకోవటం ఎలా ఉందో, నీ మనస్సును చూసి నువ్వు అనుకోవటం అలా ఉంది, అసలు అది ఉంటే కదా అన్నారు. ఉన్నదేదో తెలియక పోవటం వలన లేని శరీరాన్ని మనస్సును, గౌరవాలను, డబ్బును నేను అనుకొంటూ ఆ సుడిగుండాలలో పడి ఎంతో శ్రమపడిపోతున్నావు. నీ హృదయంలో దేవుడు ఉన్నాడు, నీ ప్రక్కన ఉన్నవాడి హృదయంలో కూడా దేవుడు ఉన్నాడు. ఇక్కడ ఉన్న దేవుడిని వదిలేసి ఎక్కడో గుడిలో దేవుడు ఉన్నాడని పారిపోతావు ఏమిటి, లోపలకు చూడటం నేర్చుకో. ఈ విషయాలు బాగున్నాయి, భోగాలు బాగున్నాయి అంటే పరిణామంలో ఇది అంతా దుఃఖంగా మారిపోతుంది. భార్యాభర్తల మధ్య ఉన్నది ప్రేమకాదు, అది మోహం. నా భార్య అంటే నాకు ఇష్టం అని వీడు అంటాడు, మా ఆయన అంటే నాకు ఇష్టం అని ఆవిడ అంటుంది. ఇద్దరిలో ఎవరో ఒకరు చనిపోతే 24 గంటలలో మరల పెళ్ళి చేసేసుకొంటున్నారు, ఇది ఒక డ్రామా. మిమ్మల్ని కాశీ తీసుకొని వెళతాము, రామేశ్వరం తీసుకొని వెళతాము అని భగవాన్‌తో అంటే అక్కడ చూడటానికి ఏమైనా ఉంటే కదా అనేవారు అంటే మనల్ని వెళ్ళవద్దు అని కాదు. మనకి దేహాభిమానం ఉంది కాబట్టి వెళుతూ ఉంటాము. దేహాభిమానం లేనివాడికి చూడటానికి ఏమీ లేదు, వినటానికి ఏమీ లేదు. బ్రహ్మం ఏకం, అద్వితీయం అది ఒకటిగా ఉండటమే కాదు, దానికి ద్వితీయం లేదు. గారె తినేటప్పుడు మేడలో ఉన్న వాడు ఎంత రుచి అనుభవిస్తాడో, తాటాకుఇంటిలో ఉన్నవాడు కూడా అంతే రుచి అనుభవిస్తాడు. ఇల్లు తేడా గాని విషయ సుఖాలు అందరికీ సమానమే. వారు ఎక్కువవారు, వీరు తక్కువవారు, ఇష్టాలు, అయిష్టాలు, హెచ్చుతగ్గులు ఇవన్నీ మనస్సులో ఉన్న పెంట, ముందు ఈ పెంటను వదిలించుకోండి. నువ్వు ఏదిగా ఉన్నావో అక్కడ స్థిరంగా ఉండు, అందులో నిలబడి ఉండు, దాని నిష్ట కలిగిఉండు,

అక్కడే రమించు, అదే నిజమైన రతి, అప్పుడు వాడు స్థితప్రజ్ఞుడు అవుతాడు.

పూజ, జపం, ధ్యానం చేసేవాడికంటే కర్మ చేస్తూ ఫలితాన్ని త్యాగం చేసేవాడు గొప్పవాడు, ఆత్మనిష్ఠ కలిగిన వాడు కర్మఫలత్యాగి కంటే గొప్పవాడు. మీకు ఏదైనా దుఃఖం వస్తోంది అనుకోండి, కంగారు పడకూడదు. ఆ దుఃఖం ఎందుకు వస్తోంది అంటే మీ బుద్ధిలో ఉన్న దోషాలు తీసేయటానికే అది వస్తోంది, దానిని ఎంజాయ్ చేయండి. గారెలు బాగున్నాయి, గారెలు బాగున్నాయి అని వాటిని తింటూ ఎంజాయ్ చేస్తున్నారు కదా అలాగే దుఃఖాన్ని కూడా ఎంజాయ్ చేయండి. సంపదలు ఆపదలు వస్తూఉంటాయి, పోతూఉంటాయి, అవి నిలకడగా ఉండవు, ఎందుచేత నిలకడగా ఉండవు అంటే అవి అబద్ధాలు, అబద్ధం ఏమి నిలకడగా ఉంటుంది. అవి నిలకడగా ఉండవు కాబట్టి కొంచెం సహించటం నేర్చుకో, అలా సహించటం వలన నీకు లోచూపు కలుగుతుంది. సంపదవచ్చేటప్పుడు ఎలా వస్తుందో తెలియదు, పోయేటప్పుడు ఎలా పోతుందో తెలియదు. మీకు సంపదలు వచ్చినా, ఆపదలు వచ్చినా అవి మీరు కాదు, వాటితో కలవకండి, వాటి ప్రభావం మీ మెదడు మీద పడనివ్వవద్దు. బాహ్యగొడవలతోటి, నువ్వుకాని గొడవలతోటి తాదాత్మ్యం పొందావా నువ్వు ఎన్ని జన్మలు ఎత్తినా బహిర్ముఖుడుగా ఉంటావుగాని అంతర్ముఖుడవు అవ్వలేవు, అంతర్ముఖుడు కానివాడికి ఆత్మజ్ఞానం కలుగదు. మనస్సు యొక్క మూలం ఎక్కడ ఉందో, మనస్సును నియమించేవాడు ఎక్కడ ఉన్నాడో అటువైపుకు మనస్సు జరుగుతోందో లేదో మీరు చూసుకోవాలి, సాధన యొక్క ప్రయోజనం అదే. మనస్సును నిగ్రహించి దాని మూలంలోనికి పంపితే, మనస్సు తన యజమానిని చూసిన వెంటనే అది నశిస్తుంది, అది నశించిన వెంటనే అక్కడ ఉన్న పరమాత్మ నీకు వ్యక్తమవుతాడు. మనస్సుకు మూలం, ప్రాణానికి మూలం ఒక్కటే అంటున్నారు కదా మరి మనస్సు నశించినప్పడు, ప్రాణం కూడా నశించాలి కదా మరి ముక్కులో గాలి ఎందుకు తిరుగుతోంది అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. ముక్కులో గాలి ఎందుకు తిరుగుతోంది అంటే ఆ దేహానికి ఒక ప్రారబ్ధం ఉంటుంది. దేహం ప్రారబ్ధం అనుభవించటానికి అక్కడ ప్రాణాన్ని నిలబెట్టాడు. మనస్సు నశించిన తరువాత ప్రారబ్ధం యొక్క ప్రభావం ఆ శరీరం మీద ఏమీ ఉండదు. ఆ శరీరం ద్వారా భగవంతుడు పనిచేస్తాడు.

ఈశ్వరుని దయవలన, గురువు యొక్క అకారణప్రేమ వలన జీవలక్షణాలు పోవాలి గాని మన తెలివితేటల వలన పోవు. నీకు భక్తి ఉన్నంత మాత్రం చేత ముక్తి వచ్చేయదు. భక్తి నీ చేతిలో ఉంది, నువ్వు భక్తిగా ఉండు, ముక్తి ఎప్పడు వస్తుంది అని ఎదురు చూడవద్దు, ఉద్రేకపడకు, ముక్తిని ఎప్పడు ఇవ్వాలో భగవంతుడు చూసుకొంటాడు, అది ఆయనకు వదిలెయ్యి. నీకు భక్తి అనేది సిన్సియర్‌గా ఉందో, లేదో చూసుకో. అక్కడ రాజీ పడవద్దు. శ్రీవారి పాదాలయందు నీ మనస్సు నిలబడుతోందో లేదో చూసుకోవటం మానివేసి ముక్తి అంటే అదిరాదు, అది నీ చేతిలో లేని పని. తపస్సు చేయాలి అంటే ఎక్కడికో పారిపోవటం కాదు,

మనం ఇంటి దగ్గర ఉండి తపస్సు చేసుకోవచ్చు. శరీరం, మాట, మనస్సు ఈ మూడింటితో చేసేదే తపస్సు. శరీరానికి సంబంధించిన ఇంద్రియాలను కంట్రోలులో పెట్టుకోవాలి. మనం మాట్లాడేమాట మృదువుగా ఉండాలి, ఇతరులకు ప్రియంగా ఉండాలి. మనం ఒక మాట చెపితే అది ఎదుటివారికి అర్థమయ్యే లాగ ఉండాలి, వారి మెదడుకు స్పష్టత రావాలి. సబ్జక్టు చెపితే సరిపోదు, అది అర్థమయ్యేలాగ చెప్పాలి, మీరు ఎంతవరకు ఫాలో అవుతున్నారో చూసుకోవాలి. సబ్జక్టు పట్ల అవగాహన వస్తే సాధన తేలికగా ఉంటుంది. మనస్సును చాలా పవిత్రంగా ఉంచుకోవాలి. మనకు ఎటువంటి తలంపులు వస్తున్నాయో చూసుకోవాలి, మనస్సును పవిత్రం చేసే తలంపులు వస్తూఉంటే అది మనస్సుతో చేసే తపస్సు. మన ఇంటి దగ్గర తపస్సు చేసుకొంటే బాగా సాగటంలేదు, అరుణాచలంలో బాగా సాగుతుంది అనుకొంటాము. ఇంటి దగ్గర కూడా బాగా తపస్సు చేసుకోవచ్చు అనే బుద్ధి మనకు రానివ్వటంలేదు. వాడే శనిగాడు, మనం బాగుపడకుండా మనలను శనిగాడు పట్టుకొన్నాడు. మనం బాగుపడినా శరీరం, మాట, మనస్సే కారణం, ఒకవేళ మనం పాడైపోయినా ఇవి మూడే కారణం.

వివేకానందుడి దగ్గరకు ఒకడు వచ్చాడు, వాడు యం.ఏ., చదివాడు, అదే జీవితం అనుకొంటున్నాడు. తరువాత ఏమి చేస్తావు అన్నాడు వివేకానందుడు. ఉద్యోగం సంపాదించుకొంటాను అన్నాడు. తరువాత ఏమి చేస్తావు అంటే పెళ్ళి చూసుకొంటాను అన్నాడు, తరువాత ఏమిచేస్తావు అంటే పిల్లలను కంటాను అన్నాడు, తరువాత ఏమిచేస్తావు అంటే సంపాదించుకొంటాను అన్నాడు, తరువాత ఏమిచేస్తావు అంటే ముసలివాడిని అయిపోతాను అన్నాడు, తరువాత ఏమిచేస్తావు అంటే చనిపోతాను అన్నాడు. ఈ పనులన్నీ చనిపోవటానికే చేస్తున్నావా? నీ జీవితానికి గమ్యం లేదా? చనిపోవటమే నీ పనా ఇంకో పని లేదా నీకు. నీ జీవితంలో ఏది పొందాలో నీకు తెలియటం లేదు, నీకు ఏది శ్రేయస్సో నీకు తెలియటం లేదు. జీవితంలో నీవు సాధించాలి అనుకొనే దానిని బట్టే నీ జీవితం యొక్క క్వాలిటీ పెరుగుతుంది. లక్ష్యం లేనప్పుడు నువ్వు ప్రయత్నం చేసినా క్వాలిటీ పెరగదు. లక్ష్యం లేని జీవితం ఎప్పుడూ దుఃఖమయంగా ఉంటుంది. ధ్యానం చేయటం మంచిదే. ధ్యానం చేసేటప్పుడు చేసేవాడు కనిపిస్తున్నాడు అనుకోండి అది నిజమైన ధ్యానం కాదు. అలాగని ధ్యానం చెయ్యటం మానకండి. రమణమహర్షిగారు ఏమి చెప్పారు అంటే జాగ్రదవస్థ, స్వప్నావస్థ, గాఢనిద్ర ఈ మూడు అవస్థలు వస్తూఉంటాయి, పోతూఉంటాయి, ఇవి మూడూ అబద్ధాలే. అనేక జన్మలనుండి వీటికి అలవాటు పడిపోయాము. ఇవి అబద్ధాలు కాబట్టే వస్తూఉంటాయి, పోతూఉంటాయి. అనేక జన్మల నుండి వీటిని అనుభవిస్తున్నాము కాబట్టి అవి నిజం కాకపోయినా నిజంలాగ కనిపిస్తున్నాయి. వచ్చేది, పోయేదీ ఏదీ నిజం కాదు. ఈ మూడు ఎంత అబద్ధాలో అంత నిజం అనుకొంటున్నారు, అందుచేత మీకు లోచూపు కలగటం లేదు. దీర్ఘకాలం నుండి ఈ అలవాటు ఉండటం వలన అది నిజం కింద అనిపిస్తోంది. ముందు అది అబద్ధం అని అర్థం చేసుకో.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| ఫిబ్రవరి | 10 | ఈడూరు టి.టి.డి. కళ్యాణ మండపం |
| ఫిబ్రవరి | 17 | భీమవరం తాడిమళ్ల జగన్నాథరాజు కళ్యాణ మండపం |
| ఫిబ్రవరి | 21 | హైదరాబాద్ శ్రీనివాస నగర్ కమ్యూనిటీ హాల్ |
| ఫిబ్రవరి | 25 | సఖినేటిపల్లి గీతా మందిరం |
| ఫిబ్రవరి | 29 | విజయవాడ ముత్యాలంపాడు శివాలయం |
| మార్చి | 6 | చించినాడ శివరాత్రి |
| మార్చి | 10 | లక్కవరం సరస్వతీ శిశుమందిరం మ॥ గం॥ 3-00లకు |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**



**పశ్చిమగోదావరి జిల్లా పాలమూరులో జరిగిన సత్సంగ సదస్సులో శ్రీ నాన్నగార్కి స్వాగతం చెప్పిన శ్రీ కలిదిండి నరసింహరాజుగారు, రిటైర్డ్ చీఫ్ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్**

# బ్రహ్మాన్ని స్మరించటం సంపద - బ్రహ్మాన్ని మరిచిపోవటం ఆపద

మన మనస్సు ద్వారా ప్రపంచాన్ని గుర్తిస్తూ దానితో సంబంధం పెట్టు కొంటున్నాము. ఈ మనస్సు ఆత్మ స్మరణలో ఉంటే బాహ్య ప్రపంచం అదృశ్యమై చైతన్యమే మిగులుతుంది. ఆత్మలో అనేక వస్తువులతో కూడిన ప్రపంచము లేదు కాబట్టి ఇంత వరకూ అనుభవించిన మిథ్యా వస్తు జ్ఞాపకాలను మరచిన క్షణాన్ని అహంకారం సత్యంలో ఐక్యం అయిపోతుంది. విషయ భోగవాంఛగల వానిని "రాగి" అని అవిలేని వానిని "విరాగి" అని అంటారు. జడపదార్థాలు మనిషికి సుఖదుఃఖాలను ఇవ్వగల్గుతున్నాయి అంటే మనిషిలోని ఇష్టాయిష్టాల విలువలే కారణం. జ్ఞానికి కోరికలు ఉండవు కాబట్టి వ్యామోహం ఉండదు. గత స్మృతులను పూర్తిగా తుడిచి వెయ్యగలిగినప్పడే అహంకారం అంతమౌతుంది. దాన్ని సాధించాలి అంటే మనం ఏదైతే అయి ఉన్నామో ఆ బ్రహ్మాన్ని స్మరించాలి. ఏదైతే కాదో దాన్ని స్మరించటం వల్ల అంధకారణ్యంలో తిరుగుతూ ఆపదల పాలౌతాము. పాలను కాచి తోడుపెట్టి కదలకుండా ఉంచితే పెరుగు అవుతుంది, దాన్ని చిలికితే వెన్న వస్తుంది. మనస్సు వెన్నలా అయితే శ్రీకృష్ణుడు ఇష్టంగా స్వీకరిస్తాడు దాన్ని. సాధన దశలో ఏకాంతంగా భగవంతునికోసం పరితపించాలి. దైవీ సంపదలాంటి విచారణ, సంతోషం, సత్సంగము, సమత్వము, చిత్తశుద్ధి ఉంటే మోక్ష ద్వారాలు తెరుచుకొంటాయి. శమం వల్ల శ్రేయస్సు, సమత్వం వల్ల చల్లని బుద్ధి కలిగి విషయాన్ని గ్రహించి బ్రహ్మస్మరణ చేసి మధురంగా జీవించగలము. సర్వ భూతాలను తనలా చూచేవాడు, ప్రయత్నంతో ఇంద్రియాలను నిగ్రహించినవాడు బ్రహ్మ సంపదను పొందుతాడు. పూల తోటకు నీరు పెట్టటం వల్ల మనోజ్ఞమైన పూలగుత్తులు పూస్తాయి. అలాగే సత్సంగము వల్ల బ్రహ్మ స్మరణ వల్ల, సత్ గ్రంథపఠనము వల్ల స్వభావికమైన ఆత్మజ్ఞానం లభిస్తుంది. ఈ జ్ఞాన శాంతి అనే అమృతాన్ని వదలి, విషయ భోగాలవైపు మనస్సు పరుగిడటం అంటే కల్ప వృక్షమును త్యజించి విషఫలాలను ఇచ్చే వనంలోకి వెళ్ళడం లాంటిది. స్మరణ అంటే ఏకాగ్రతతో ధ్యేయ వస్తువైన బ్రహ్మంపై నూరుశాతం దృష్టిని నిలపాలి అలాకాక, మాల చేతిలోనే తిరుగుతుంది. నామంతో నాలుక నోటిలో తిరగుతుంది కాని మనస్సు పది దిక్కులా తిరుగుతుంది. అది స్మరణ కాదు. స్మరణలో కాలగతి తెలియకూడదు, సుఖం రావాలి అదే నిజమైన సంపద ఆ సంపదతోనే బ్రహ్మం అనుభవమౌతుంది.

**- సాగిరాజు రామకృష్ణంరాజు**, అర్థవరం